అచల గురుమాతాజీ సమేత అచల గురూజీ
వారి అఖండ పరిపూర్ణ ఆశీస్సులతో



సత్య దీపిక
ఉదయం
తెలుగు దినపత్రిక

SDU NEWS
SATHYA DEEPIKA UDAYAM
PLEASE SUBSCRIBE | SHARE | LIKE

ప్రచురణ : అమలాపురం | సంపుటి : 01 | సంచిక : 122 శనివారం 07-11-2026 | ఎడిటర్: ఎస్.ఎస్ రావు | పేజీలు : 04 | వెల : 3-00

అమృతమూర్తికి అశ్రునివాళి



మమ్మల్ని అనురాగ, ఆప్యాయతలతో పెంచి, కుటుంబ ఉన్నతికై అహర్నిశలు శ్రమించి, మా భవితకు బంగారు బాటలు వేసిన మహోన్నతవ్యక్తి

శ్రీ అప్పారి భాస్కరరావు గారి

మరణం మాకు తీరని లోటు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కీ॥శే॥ అప్పారి భాస్కరరావు గారు

SBI Rtd.

జననం: 14-12-1944 మరణం: 27-10-2026

శెట్టిపేట

భార్య: **విజయకృష్ణ**

కుమారుడు : **అప్పారి రవీంద్రనాథ్** కోడలు : **నాగరత్నదేవి**

కుమార్తె : **దంగేటి సుహాసిని** అల్లుడు : **సీత్యశ్రీనివాస్**

సోదరులు : అప్పారి శ్రీనివాసరావు - వెంకటలక్ష్మి, అప్పారి మరిడిశెట్టి - సీక్కుబాయి

సోదరుడు కుమారుడు: అప్పారి విద్యాసాగర్ - దుర్గా భవాని

చెల్లెలు : **విత్తనాల సుశీల** బావ : **గోపాలకృష్ణ**

మనుమలు : శ్రీకార్తిక్, సంజనకృష్ణ, హారిణి, సాయి ప్రణవ్

పెద్దకార్యం: ది.07-11-2026 శనివారం అమలాపురం మండలం, భట్నవిల్లి శెట్టిపేటలో మా స్వగృహమునందు జరుపబడును.

సముద్రంలో మునిగిన చెన్నై సోనా బోటు



ఒంగోలు సబర్బన్/ఒంగోలు టౌన్/ చెన్నై: తమిళనాడు రాజధాని చెన్నై హార్బర్‌కు చెందిన సోనా బోటు ప్రకాశం జిల్లా కొత్తపట్నం సముద్ర తీరానికి సమీపంలో సముద్ర జలాల్లో ప్రమాదానికి గురైంది. మురసు తుపాను తాకిడికి కారణంగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్టు తెలుస్తోంది. ఈ దుర్ఘటనలో 9 మంది మత్స్యకారులు మరణించినట్టు అనుమానిస్తున్నారు. ప్రకాశం జిల్లాలోని సముద్ర తీరానికి 4 మృతదేహాలు చేరగా.. మిగిలిన ఐదుగురి ఆచూకీ కోసం కోస్ట్‌గార్డ్ బృందాలు గాలిస్తున్నాయి. గురువారం కొత్తపట్నం సముద్ర తీరంలో మూడు మృతదేహాలు, మండలంలోని పిన్నివారిపాలెం తీరానికి మరో మృతదేహం కొట్టుకొచ్చాయి.

స్థానిక మత్స్యకారులు ఇచ్చిన సమాచారంతో కలెక్టర్ పి.రాజాబాబు, ఒంగోలు ఆర్డీవో టి.చంద్రశేఖర్ రెవెన్యూ, పోలీస్ అధికారులతో కలిసి కొత్తపట్నం సముద్ర తీరానికి చేరుకున్నారు. చెన్నై మత్స్య శాఖ, చెన్నై హార్బర్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. గత నెల 29న చెన్నై హార్బర్ నుంచి కూడిన మూడు సోనా బోట్లలో మత్స్యకార బృందాలు సముద్రంలో చేపల వేటకు బయల్దేరాయి. వీటిలో రెండు రామాయపట్నం పోర్టులో ఆగిపోయాయి. మరోబోటు ప్రమాదానికి గురై మునిగిపోయింది.

ఇక ప్రమాదానికి గురైన వారిలో చెన్నై రాయపురానికి చెందిన పక్కిరి సామి (49), రాయపురం వాషర్‌మెన్ పేటకు చెందిన కుప్పం మనోహరన్ (40), రాయపురానికే చెందిన మోహన్ (47), చెన్నై తిరువత్తియూర్‌కు చెందిన రాజేష్ (52), తోండియర్ పేటకు చెందిన మురుగన్ (48), రాయపురానికి చెందిన కుప్పుస్వామి (58), తిరువత్తియూర్‌కు చెందిన విజయ్‌కాంత్ (44), తోండియర్‌కు చెందిన అరవింద్ (40), కడలూరుకు చెందిన నారాయణన్ (57)గా గుర్తించారు. మరోవైపు.. లభ్యమైన మృతదేహాలను తమిళనాడు ఆర్థిక శాఖ మంత్రి ఎన్. మేరీ విల్సన్ గురువారం రాత్రి పరిశీలించారు.

ఆ ఏడు కేసులను ఎందుకు మూసేశారు?



అమరావతి: అప్పటి ప్రభుత్వ పెద్దలు నారా చంద్రబాబు నాయుడు, పొంగూరు నారాయణ, పలువురు మంత్రులు, అధికారులపై దాఖలైన స్కిల్ డెవలప్‌మెంట్‌సహా ఏడు కేసులను కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)కు అప్పగించాలంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు (పిల్స్)లో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ ఏడు కేసులను 'మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్' అంటూ మూసివేస్తూ సీఐడీ దాఖలు చేసిన నివేదికలకు సంబంధించిన వివరాలను కేసుల వారీగా పొందుపరిచి సమగ్ర పట్టికను సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది.

ఆయా కేసుల్లో ఫిర్యాదుదారుల వైఖరి, క్లోజర్ రిపోర్టుల దాఖలు, వాటి ఆమోదం, ప్రొటెస్ట్ పిటిషన్ల వివరాలను కేసుల వారీగా సమగ్ర పట్టిక రూపంలో తమ ముందు ఉంచాలని సీఐడీని ఆదేశించింది. ఈ వివరాలతోపాటు సంబంధిత డాక్యుమెంట్లను కూడా సమర్పించాలని స్పష్టంచేసింది. వాటి ప్రతులను పిటిషనర్ తరఫు న్యాయవాదికి అందించాలని కూడా నిర్దేశించింది. క్లోజర్ రిపోర్టులను సవాలు చేస్తూ ప్రొటెస్ట్ పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నప్పుడు సంబంధిత కోర్టు వాటిని పరిశీలించవచ్చని ధర్మాసనం స్పష్టంచేసింది. కేసులకు సంబంధించి స్వాధీనం చేసుకున్న వస్తువులు, కీలక ఆధారాలను పరిరక్షించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేస్తే సంబంధిత న్యాయస్థానం పరిశీలిస్తుందని కూడా సూచించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీచేసిన ప్రధాన న్యాయమూర్తి (సీజే)జస్టిస్ లీసా గిల్, న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్‌లతో కూడిన ధర్మాసనం తదుపరి విచారణను ఈ నెల 10వ తేదీకి వాయిదా వేసింది. స్కిల్ డెవలప్‌మెంట్, అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్, అసైన్డ్ భూములు, ఏపీ ఫైబర్‌నెట్, మద్యం, ఇసుక విధానాలకు సంబంధించి దాఖలైన కేసుల దర్యాప్తును సీబీఐ, ఈడీలకు అప్పగించాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాలను ధర్మాసనం గురువారం విచారించింది.

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని కోరుతూ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ 2023లో పిల్ దాఖలు చేశారు. అలాగే చంద్రబాబు తదితరులపై వివిధ ఆర్థిక నేరాలకు సంబంధించి నమోదైన ఏడు కేసుల దర్యాప్తును సీబీఐ, ఈడీలకు బదిలీ చేయాలని కోరుతూ స్వర్ణాంధ్ర తెలుగు డైలీ ఎడిటర్ కె.బాలగంగాధర్ తిలక్ 2024లో పిల్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే.

ఓటర్ల జాబితాలో పేరు లేదా?.. గుడ్ న్యూస్ చెప్పిన ఎన్నికల సంఘం..

ఢిల్లీ: ఓటర్ల జాబితాలో పేరు గల్లంతైన వారికి కేంద్ర ఎన్నికల సంఘం భారీ ఊరటనిచ్చింది. ముసాయిదా ఓటర్ల జాబితాలో పేరు లేకపోయినా.. తుది జాబితాలో చోటు దక్కించుకునేందుకు మరో అవకాశాన్ని కల్పించింది. ఈ మేరకు తెలుగు రాష్ట్రాలతో సహా మొత్తం ఏడు రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల సంఘం ఆదేశాలతో గైర్హాజరు, ఇల్లు మారడం, మరణం, డూప్లికేట్ ఓటరు ఐడీ వంటి కారణాలతో ఏఎస్ఁడజాబితాలో పడి ఓటు గల్లంతైన వారికి ప్రయోజనం చేకూరనుంది.ఈ సందర్భంగా గైర్హాజరైనవారు, ఇల్లు మారినవారు, మరణించినవారు, డూప్లికేట్ ఓటర్లుగా గుర్తించిన వారి జాబితాలను మరోసారి పరిశీలించాలని సీఈఓలను ఈసీ ఆదేశించింది. ఈ జాబితాలను పోలింగ్ బూత్‌లు, పంచాయతీ, మున్సిపల్ కార్యాలయాల్లో మరోసారి ప్రదర్శించాలని సూచించింది. అలాగే, రాష్ట్ర పరిధిలోనే ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి నివాసం మార్చుకున్న ఓటర్లకు ఈసీ ప్రత్యేక అవకాశం కల్పించింది. అలాంటి వారు ఫారం-8 సమర్పించకుండానే ఎన్యూమరేషన్ ఫారం, చిరునామా ధ్రువీకరణ పత్రంతో ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించింది. దీనికి సంబంధించి పాత ఓటరు గుర్తింపు కార్డు (జ్రూ×జ) నంబర్ ఆధారంగా జుజ×చీజు యాప్ లేదా వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. దీంతో కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండానే ఓటర్లు తమ వివరాలను నమోదు చేసుకునే అవకాశం లభించనుంది.

మరోవైపు, ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో బూత్ లెవల్ అధికారులు (దీూూం) రాజకీయ పార్టీల ఏజెంట్లతో కలిసి ఇంటింటికీ వెళ్లాలని ఈసీ స్పష్టం చేసింది. అర్హులైన ఓటర్ల నుంచి అవసరమైన ఫారాలను సేకరించి, వారి పేర్లు తుది జాబితాలో చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. మొత్తంగా,



ముసాయిదా జాబితాలో పేరు కనిపించలేదని ఓటు హక్కుపై ఆశలు వదులుకోవాల్సిన అవసరం లేదని ఈసీ స్పష్టం చేసింది. అర్హులైన ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ పేర్లు తుది ఓటర్ల జాబితాలో ఉండేలా చూసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘం సూచించింది.

ఏపీ విపత్తు నిర్వహణ భేష్..

ప్రభుత్వ పనితీరుపై కేంద్రం ప్రశంసలు



అమరావతి, నవంబరు 6: 'అర్నబ్', 'మురసు' జంట తుఫాన్‌ల విపత్తు నిర్వహణలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్కార్ సేవలు భేష్‌గా నిలిచాయని కేంద్ర బృందం ప్రశంసలు కురిపించింది. తుఫాన్‌లపై సకాలంలో బాధితులకు అందించిన సేవలకు గానూ రాష్ట్ర ప్రభుత్వ తీరును కేంద్ర బృందం అభినందించింది. అయితే, 'అర్నబ్', 'మురసు' జంట తుఫాన్‌లు ఒకే వారంలో విరుచుకుపడటంతో 20 జిల్లాలపై తీవ్ర ప్రభావం చూపించాయి. 120 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులు.. ప్రకృతి బీభత్సాన్ని దీటుగా ఏపీ ప్రభుత్వం ఎదుర్కొంది.ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనికత, ముందస్తు వ్యూహాలతో పెనుముప్పు తప్పింది.. ఆపదలో రాష్ట్రాన్ని సురక్షిత నాయకత్వం ఆదుకుంది. విపత్తు నిర్వహణలో దేశానికే ఆదర్శంగా ఏపీ నిలించింది. తుఫాన్‌ల ప్రభావంతో కనిష్ఠ స్థాయికి ఆస్తి, ప్రాణనష్టం వచ్చింది. ప్రాణ రక్షణ కవచాల్లాగా రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ (ూూూణపీూూ), ఆర్టీజీఎస్ అధికారులు (=+ూ) పనిచేశారు. కంట్రోల్ రూమ్ నుంచి 24/7 తుఫాన్‌ల పర్యవేక్షణ.. కచ్చితమైన అంచనాలతో యంత్రాంగం అప్రమత్తమైంది.

ఏఐ, శాటిలైట్ సమాచారంతో ఫోన్లకు హెచ్చరికలను ఏపీ సర్కార్ జారీ చేసింది. 'మనమిత్ర' వాట్సాప్ యాప్‌తో సత్వర సహాయం అందజేసింది. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, పోలీసు శాఖల సమన్వయం ద్వారా లక్షలాది మంది సురక్షిత ప్రాంతాలకు తరలించింది. పునరావాస కేంద్రాల్లో బాధితులకు సర్కార్ అండగా నిలిచింది. నిరంతరాయంగా ఆహారం, తాగునీరు, వైద్యం అందజేసింది. రికార్డు వ్యవధిలో రాకపోకలను పునరుద్ధరించింది. అధికారుల సమష్టి కృషితో వేగంగా సాధారణ స్థితికి జనజీవనం వచ్చింది.

తగ్గనున్న ట్రైన్ టికెట్ ధరలు.. కొత్త రూల్స్ వస్తున్నాయ్!

రైలు ప్రయాణం చేసేవారికి శుభవార్త. ఎందుకంటే.. 2027 జనవరి నుంచి టికెట్ ధరలు తగ్గే అవకాశం ఉంది. ఈ రేట్లు ఎందుకు తగ్గనున్నాయి?, ఎంత తగ్గనున్నాయి?, అనే విషయాలను ఈ కథనంలో వివరంగా తెలుసుకుందాం.

2027 జనవరి 1 నుంచి దేశవ్యాప్తంగా 40కి పైగా రైళ్లకు సూపర్‌ఫాస్ట్ హోదా తొలగించి, వాటిని సాధారణ ఎక్స్‌ప్రెస్ రైళ్లుగా నడపనున్నట్లు తెలుస్తోంది. జాబితాలో.. మహానగరి, ప్రగతి, తులసి, సప్త క్రాంతి వంటి ప్రముఖ రైళ్లు కూడా ఉన్నాయి. ఈ మార్పుల వల్ల ప్రయాణికులకు టికెట్ ధరలు తగ్గే అవకాశం ఉంది. కొన్ని రైళ్ల నంబర్లు కూడా మారనున్నట్లు సమాచారం.

సూపర్‌ఫాస్ట్ హోదా ఇవ్వాలంటే

సాధారణంగా ఒక రైలుకు సూపర్‌ఫాస్ట్ హోదా ఇవ్వాలంటే.. కొన్ని నిబంధనలు ఉంటాయి. బ్రాడ్‌గేజ్ మార్గంలో రైలు తన పూర్తి ప్రయాణంలో గంటకు సగటున కనీసం 55 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించాలి. రెండు దిశల్లోనూ ఈ ప్రమాణాన్ని అందుకోవాల్సి ఉంటుంది. కానీ.. ఇటీవల రైల్వే శాఖ నిర్వహించిన సమీక్షలో కొన్ని సూపర్‌ఫాస్ట్ రైళ్లు ఈ వేగాన్ని అందుకోవడం లేదని గుర్తించినట్లు బిజినెస్ టుడే నివేదించింది.

దీనికి ప్రధాన కారణాలు.. రైలుకు మధ్యలో అదనపు స్టాపులు పెరగడం, రైల్వే ట్రాక్‌లపై రద్దీ ఎక్కువగా ఉండటం, కొన్ని ప్రాంతాల్లో సింగిల్ లైన్ మార్గాలు ఉండటం అని తెలుస్తోంది. దీంతో సూపర్‌ఫాస్ట్ ప్రమాణాలను అందుకోలేని రైళ్లకు ఆ హోదాను తొలగించాలని నిర్ణయించినట్లు సమాచారం.

ఈ రైళ్లపై ప్రభావం

ఈ ప్రభావం ఏయే రైళ్లపై పడనుంది అనే విషయానికి వస్తే.. సెంట్రల్ రైల్వే పరిధిలో మొత్తం 18 రైళ్లు ఈ జాబితాలో ఉన్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ఇందులో.. ముంబై సీఎస్ఎంటీ



నుంచి పూణే వెళ్లే ప్రగతి ఎక్స్‌ప్రెస్, లోకమాన్య తిలక్ టెర్మినస్ నుంచి అయోధ్య కాంట్ వెళ్లే తులసి ఎక్స్‌ప్రెస్ ఉన్నాయి. ఈస్ట్ సెంట్రల్ రైల్వే పరిధిలో 20 రైళ్లకు సూపర్‌ఫాస్ట్ హోదా తొలగించే అవకాశం ఉంది. ఇందులో.. సప్త క్రాంతి ఎక్స్‌ప్రెస్ కూడా ఉంది. ఉత్తరాఖండ్ ప్రాంతానికి చెందిన మరో ఎనిమిది రైళ్లు కూడా ఈ జాబితాలో ఉన్నట్లు సమాచారం. తనక్‌పూర్-ఢిల్లీ, డెహ్రాడూన్-కాఠ్‌గోదాం రైళ్లు కూడా ఇందులో ఉన్నాయి. వీటితో పాటు గోవా ఎక్స్‌ప్రెస్ పేరు కూడా ఈ జాబితాలో కనిపిస్తోంది.

రాజ్యాంగానికి రక్షణ ఎక్కడ?: కాకాణి సంచలన ఆరోపణలు

ి నెల్లూరు: ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన జిల్లా, మండల పరిషత్ ఎన్నికలు తీవ్ర విమర్శలకు దారితీశాయి. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో అధికార కూటమి అరాచకాలకు పాల్పడిందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. అన్యాయాన్ని ఎదుర్కొనేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు.. ప్రజలను కాపాడాల్సిన పోలీసులతోనే పోరాడాల్సిన పరిస్థితి వచ్చిందని విమర్శించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల్లో ఒక్కదాన్ని కూడా అమలు చేయలేదని వారు మండిపడ్డారు.ఏపీలో పరిషత్ ఎన్నికలు జరిగిన విధానంపై, ఆ సమయంలో పోలీసులు ప్రవర్తించిన దారుణమైన తీరుపై.. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను లక్ష్యంగా చేసుకుని బెదిరింపులకు పాల్పడ్డారని వారు ఆరోపించారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లకుండా పార్టీ శ్రేణులను నిర్బంధించారని, ప్రధాన నాయకులను హౌస్ అరెస్టులు చేయగా, కొందరు నేతలను గ్రామాల నుంచి వెళ్లగొట్టారని, ఈ పరిస్థితి చాలా దారుణమని అన్నారు. నెల్లూరు జిల్లాలో పోలీసుల సమక్షంలోనే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు జరిగాయని, గాయపడిన వారిని సైతం తరిమికొట్టారని వారు విమర్శించారు. మంత్రిగా ఉన్న ఆనం పోలింగ్ కేంద్రాల వద్దకు ఎలా వెళ్తారని వారు ప్రశ్నించారు. మంత్రులు, ఎమ్మెల్యేలే స్వయంగా వెళ్లి బూత్ క్యాప్చరింగ్‌కు పాల్పడ్డారు. అలాగే, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన చోట పోలింగ్ రద్దు చేయకపోవడంపై కలెక్టర్‌ను నిలదీస్తున్నానని కాకాణి అన్నారు.మర్రిపాడులో ఎస్ఐ బలరాం, సీఐ గంగాధర్



అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించడంతోపాటు.. టీడీపీకి చెందిన వారు గూడూరు వైఎసార్‌సీపీ ఇన్‌చార్జి గురవయ్య ఇంటిపై దాడికి యత్నించారని వారు ఆరోపించారు. గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను తరిమికొట్టడం, పోలీస్‌స్టేషన్‌కు తరలించిన తీరు సరికాదని మండిపడ్డారు.

విద్యాదాతగా, మార్గదర్శిగా నిలిచిన అప్పారి భాస్కరరావు

- కుటుంబ అభ్యున్నతికి, సమాజ శ్రేయస్సుకు జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు



అమలాపురం, నవంబరు 06 (సత్య దీపిక ఉదయం విలేకరి) : కుటుంబ బాధ్యతలను భుజాన వేసుకుని, తన కష్టార్జితంతో కుటుంబాన్ని ఉన్నత స్థాయికి చేర్చడమే కాకుండా, ఎంతోమంది జీవితాల్లో వెలుగులు నింపిన అప్పారి భాస్కరరావు (1944--2026) అక్టోబర్ 27న కన్నుమూశారు. ఆయన మరణం కుటుంబ సభ్యులతో పాటు ఆయన ద్వారా విద్య, ఉద్యోగ, ఆర్థిక రంగాల్లో ప్రోత్సాహం పొందిన అనేకమందికి తీరని లోటుగా మిగిలింది. 1944లో అమలాపురం సమీపంలోని భట్నవిల్లి గ్రామంలో జన్మించిన భాస్కరరావు చిన్ననాటి నుంచే క్రమశిక్షణ, కష్టపడే తత్వం, సేవాభావాన్ని అలవర్చుకున్నారు. 1969లో అమలాపురంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. మధ్యలో విద్యాశాఖలో రెండేళ్లపాటు సేవలందించి, తిరిగి బ్యాంకింగ్ రంగంలో కొనసాగుతూ తన ఉద్యోగ జీవితంలో అంకితభావం, నిబద్ధతకు ప్రాధాన్యతనిచ్చారు. భార్య, కుమారుడు, కుమార్తెతో కూడిన కుటుంబానికి ఆయన అండగా నిలవడమే కాకుండా, తన సోదరులు, సోదరీమణుల అభ్యున్నతి కోసం ఎంతో శ్రమించారు. కుటుంబ సభ్యులందరూ జీవితంలో స్థిరపడాలని, ఉన్నత స్థాయికి ఎదగాలని నిరంతరం తపించారు. తన వ్యక్తిగత సుఖసంతోషాల కంటే కుటుంబ సభ్యుల భవిష్యత్తుకే అధిక ప్రాధాన్యతనిచ్చిన కుటుంబ పెద్దగా గుర్తింపు పొందారు.

ఆయన సేవలు కేవలం కుటుంబానికే పరిమితం కాలేదు. విద్య ద్వారానే వ్యక్తి జీవితంలో నిజమైన అభివృద్ధి సాధ్యమని బలంగా విశ్వసించిన ఆయన, ఆర్థిక ఇబ్బందులతో చదువుకు దూరమవుతున్న ఎంతోమంది విద్యార్థులకు అండగా నిలిచారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన పలువురికి పాఠశాల, కళాశాల ఫీజులు చెల్లించి వారి విద్యాభ్యాసం కొనసాగేందుకు సహకరించారు. ఎంతోమందిని ఉన్నత విద్య వైపు నడిపించి, ఉద్యోగాలు సాధించి జీవితాల్లో స్థిరపడేలా ప్రోత్సహించారు. అంతేకాకుండా, యువతకు ఉద్యోగ అవకాశాలు, ఆర్థిక ప్రణాళిక, ఆస్తుల సముపార్జన, భూముల కొనుగోలు, వివాహ సంబంధాల కుదుర్చుకోవడం వంటి అనేక జీవిత విషయాల్లో విలువైన సలహాలు, సూచనలు అందించేవారు. సంపాదనతో పాటు ఆస్తులను కూడబెట్టుకోవడం, భవిష్యత్తుకు భరోసా కల్పించుకోవడం, కుటుంబాలను చక్కదిద్దుకోవడం వంటి అంశాల్లో ఎంతోమందికి మార్గదర్శకుడిగా వ్యవహరించారు. ఆయన వద్దకు సలహా కోసం వచ్చిన వారిని ఆప్యాయంగా పలకరిస్తూ, వారి సమస్యలను ఓపికగా విని, సాధ్యమైనంత సహాయం చేసేవారు. పెద్దలు, యువకులు, సామాన్య ప్రజలు అనే తేడా లేకుండా అందరితో సన్నిహితంగా మెలుగుతూ, పలువురి జీవితాల్లో ఒక మెంటార్‌గా, శ్రేయోభిలాషిగా నిలిచారు. ఆయన ప్రోత్సాహంతో విద్యావంతులై, ఉద్యోగాల్లో స్థిరపడి, కుటుంబాలను అభివృద్ధి చేసుకున్న వారు ఎందరో ఉన్నారు.

ఒక వ్యక్తి సంపాదించిన ఆస్తులు, హోదా కంటే ఆయన వల్ల అభివృద్ధి చెందిన మనుషులే నిజమైన సంపద అనే భావనకు భాస్కరరావు జీవితం ఒక నిదర్శనం. తాను ఎదగడమే కాకుండా, తన చుట్టూ ఉన్నవారు కూడా ఎదగాలని కోరుకున్న ఆయన సేవా దృక్పథం పలువురికి స్ఫూర్తిదాయకం.

ఆయన భౌతికంగా దూరమైనప్పటికీ, కుటుంబ సభ్యులకు అందించిన ప్రేమ, సోదరసోదరీమణుల కోసం చేసిన త్యాగాలు, విద్యార్థులకు అందించిన ఆర్థిక సహాయం, ఎంతోమందికి చూపిన జీవిత మార్గదర్శనం రూపంలో ఆయన జ్ఞాపకాలు చిరస్థాయిగా నిలిచిపోతాయి.

అప్పారి భాస్కరరావు గారి 11వ రోజు కార్యక్రమం నవంబర్ 7, 2026న ఆయన జన్మస్థలమైన భట్నవిల్లి గ్రామంలో నిర్వహించనున్నారు.

కుటుంబానికి పెద్ద దిక్కుగా, సమాజానికి శ్రేయోభిలాషిగా, ఎంతోమందికి మార్గదర్శిగా జీవించిన ఆయనకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు ఘనంగా నివాళులర్పిస్తున్నారు.

ఆయన జీవితం ఒక ఆదర్శం... ఆయన సేవలు ఎన్నో కుటుంబాలకు వెలుగు... ఆయన జ్ఞాపకాలు చిరస్మరణీయం.

కార్తీకమాసం లో ఆకాశ దీపం వెలిగించు కొనుటకు ఇత్తడి ఆకాశ దీప ప్రమిదలు.సమర్పించిన భక్తులు.



కాకినాడ రూరల్ నవంబర్ (సత్య దీపిక ఉదయం):కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ స్థానిక ఇంద్రపాలెం పోస్ట్ ఆఫీస్ వీధి శ్రీ లక్ష్మీ గణపతి స్వామీ వారి భక్తులు, కీర్తి శేషులు శ్రీ కోపెర్ల సుదర్శన్ వర్మ కుటుంబ సభ్యులు రమణి , కుమారులు సుమంత్, కుమార్తె శ్రీనిజా శుక్రవారం శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రమణ్య స్వామివారి కి, శ్రీ మందేశ్వర స్వామి వారికి కార్తీకమాసం లో ఆకాశ దీపం వెలిగించు కొనుటకు ఇత్తడి ఆకాశ దీప ప్రమిదలు స్వామి ఆలయ అర్చకులు శ్రీ చంద్రమౌళి శర్మ సమక్షంలో శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రమణ్య స్వామివారి ఆలయ అర్చకులు శ్రీ దత్తు శర్మ కు సమర్పించారు.

ఎంపీటీసీ/జడ్పీటీసీ ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా మాడుగుల మండలంలో కఠిన ఆంక్షలు

అనుమతి లేని ర్యాలీలు, సంబరాలపై నిషేధం ఎస్పై నారాయణరావు హెచ్చరిక



అనకాపల్లి నవంబర్ :06
(సత్యదీపిక ఉదయం బ్యూరో)

మాడుగుల మండలంలో నాయకులుకు కార్యకర్తలుకు ప్రజలకు మాడుగుల ఎస్పై జి నారాయణరావు హెచ్చరిక చేశారు 2వ సాధారణ ఎన్నికలుభాగంగా మాడుగుల మండలంలో ఎంపీటీసీ/జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ అత్యంత ప్రశాంత వాతావరణంలో ముగిసింది. ఈ నేపథ్యంలో (నవంబర్ 7) జరగనున్న ఓట్ల లెక్కింపు (కౌంటింగ్) ప్రక్రియను పురస్కరించుకుని శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా మాడుగుల మండలం వ్యాప్తంగా కఠిన ఆంక్షలు అమలు చేస్తున్నట్లు మాడుగుల ఎస్పై జి నారాయణరావు తెలిపారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు సీఐ రామకృష్ణ సూచనలు మేరకు ఈ భద్రతా చర్యలు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు.?కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు, ఫలితాల వెల్లడి అనంతరం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరోధించేందుకు సబ్ డివిజన్ పరిధిలో పోలీస్ యాక్ట్ సెక్షన్ 30, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బిఎన్ఎస్ఎస్) సెక్షన్ 163 (గతంలో సెక్షన్ 144) నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయని స్పష్టం చేశారు. కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లో, బహిరంగ ప్రదేశాల్లో మరియు ప్రధాన కూడళ్లలో ప్రజలు లేదా రాజకీయ పార్టీల కార్యకర్తలు గుంపులుగా గుమిగూడటం పూర్తిగా నిషిద్ధం.పోలీసు శాఖ ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు, బైక్ ర్యాలీలు, సంబరాలు, బహిరంగ సభలు లేదా ఊరేగింపులు నిర్వహించడానికి వీల్లేదు.

రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో బాణసంచా (టపాసులు) కాల్చడం మరియు అధిక శబ్దాలు చేసే డీజే సౌండ్ సిస్టమ్‌లు వినియోగించడంపై పూర్తి నిషేధం విధించడమైనది.

ఇతర పార్టీలు లేదా వ్యక్తులను కించపరిచేలా రెచ్చగొట్టే నినాదాలు చేయడం నేరం. ముఖ్యంగా వాట్సాప్, ఫేస్‌బుక్ తదితర సోషల్ మీడియా వేదికల ద్వారా శాంతిభద్రతలకు భంగం కలిగించే అసత్య ప్రచారాలు, రెచ్చగొట్టే పోస్టులు పెడితే సైబర్ క్రైమ్ కింద కేసులు నమోదు చేస్తారు.

?"పోలింగ్ మాదిరిగానే కౌంటింగ్ ప్రక్రియ కూడా ప్రశాంతంగా ముగిసేందుకు ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు పూర్తి సహకారం అందించాలి. ఎన్నికల నియమావళిని గానీ, పోలీసు ఆంక్షలను గానీ ఉల్లంఘిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటాం, తక్షణమే కేసులు నమోదు చేస్తామని మాడుగుల ఎస్పై జి నారాయణరావు తెలిపారు

మంత్రులతో విజయోత్సాహం..

పలాస అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ!

అచ్చెన్నాయుడు, రామ్మోహన్ నాయుడులను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన మున్సిపల్ ప్రజాప్రతినిధులు



పలాస, నవంబర్ 6 (సత్యదీపిక ఉదయం బ్యూరో శంకర్):
పలాస--కాశీబుగ్గ మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఘనవిజయం సాధించిన నేపథ్యంలో నూతనంగా ఎన్నికైన చైర్‌పర్సన్ గంగాభవానితో పాటు కౌన్సిలర్లు విజయోత్సాహంతో రాష్ట్ర, కేంద్ర మంత్రులను మర్యాదపూర్వకంగా కలిశారు. తొలుత నియోజకవర్గంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం వాహన శ్రేణితో వెళ్లి రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడులను, జిల్లా పార్టీ అధ్యక్ష, కార్యదర్శులను కలిశారు.

ఈ సందర్భంగా పలాస--కాశీబుగ్గ మున్సిపాలిటీలో కూటమికి ప్రజలు అందించిన అఖండ విజయాన్ని మంత్రులకు వివరించి, ప్రజల ఆదరణ, నమ్మకం, సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను మంత్రులు అభినందించి, పట్టణ అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. ప్రజలు కూటమిపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేయాలని మంత్రులు సూచించారు. ముఖ్యంగా తాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధి, పారిశుద్ధ్యం, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, మౌలిక సదుపాయాల కల్పన, పట్టణ సుందరీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఓట్ల ప్రాతిపదికన పలాస--కాశీబుగ్గ మున్సిపాలిటీ రెండో స్థానంలో నిలవడం అభినందనీయమని, అభివృద్ధి విషయంలో మాత్రం రాష్ట్రంలోనే ప్రథమ స్థానానికి తీసుకెళ్లేలా సమష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు. పలాస--కాశీబుగ్గను రాష్ట్రంలోనే అత్యంత సుందరమైన, ఆదర్శవంతమైన మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.

ప్రజలు అందించిన విజయాన్ని బాధ్యతగా స్వీకరించి, రాజకీయాలకు అతీతంగా పట్టణ ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని మంత్రులు సూచించారు. దీనికి స్పందించిన నూతన ప్రజాప్రతినిధులు ప్రజల ఆశీర్వాదంతో సాధించిన విజయానికి తగిన ప్రతిఫలంగా అభివృద్ధి పనులను చేపట్టి, పలాస--కాశీబుగ్గను ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరి, ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు, నూతన మున్సిపల్ చైర్‌పర్సన్ గంగాభవాని, నూతన కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పలాస శ్రీ చైతన్య పాఠశాలలో మెగా రక్తదాన శిబిరం

22 మంది స్వచ్ఛందంగా రక్తదానం.. మానవత్వాన్ని చాటుకున్న సిబ్బంది, తల్లిదండ్రులు



పలాస, నవంబర్ 6 (సత్యదీపిక ఉదయం బ్యూరో శంకర్):శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్‌పర్సన్ డాక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని పలాసలోని స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో మెగా రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపల్ హృషికేష్ దాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల, కళాశాల ఉపాధ్యాయ, ఉపాధ్యా యేతర సిబ్బందితో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొత్తం 22 మంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడవచ్చనే సందేశాన్ని చాటుతూ సామాజిక బాధ్యతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య పాఠశాలల ఉత్తరాంధ్ర ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఎం.వి. సురేష్, శ్రీకాకుళం రీజినల్ ఇన్‌చార్జి ఎస్. రామినాయుడు, అకడమిక్ కో-ఆర్డినేటర్ ఎ. బాలరాజు, కళాశాల ఏఓ రామరాజు, ప్రిన్సిపల్ బి. యాదవరావు పాల్గొని రక్తదానం చేసిన వారిని అభినందించారు. అలాగే పాఠశాల డీన్ ఎస్. జోగారావు, ఐకాన్ ఇన్‌చార్జి కె. షణ్ముఖరావు, సి-బ్యాచ్ ఇన్‌చార్జి యుధిష్టర్ రెడ్డి, ప్రైమరీ ఇన్‌చార్జి నీలవేణి, ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జి చాందిని, పాఠశాల ఏఓ జయబాబు తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది సమిష్టి సహకారంతో రక్తదాన శిబిరం విజయవంతమైంది.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ కౌంటింగ్ ఏజెంట్లకు దిశానిర్దేశం



అనకాపల్లి, నవంబర్ 6(సత్య దీపిక ఉదయం):ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో ఏజెంట్లు అనుసరించాల్సిన నియమ నిబంధనలు, విధివిధానాలపై స్థానిక సత్యా గ్రాండ్ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ , రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, అనకాపల్లి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ కౌంటింగ్ ఏజెంట్లకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కౌంటింగ్ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ ప్రతి ఓటును జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. పార్టీ అభ్యర్థుల విజయానికి కౌంటింగ్ ఏజెంట్లు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

కరాచీ సమీపంలో లష్కరే ఉగ్రవాదులకు శిక్షణ..



పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా మరోసారి సముద్ర మార్గంలో దాడులకు సిద్ధమవుతోందా? నిఘా వర్గాల నుంచి వెలువడిన తాజా సమాచారం ఈ అనుమానాలను పెంచుతోంది. కరాచీకి సమీపంలోని చర్నా ద్వీపంలో లష్కరే ఉగ్రవాదులకు సముద్ర కార్యకలాపాలపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు సమాచారం. ఈ శిక్షణను పర్యాటక కార్యకలాపాల ముసుగులో నిర్వహిస్తున్నట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. స్కూబా డైవింగ్, కాంబాట్ స్విమ్మింగ్, నీటి అడుగున కార్యకలాపాలకు సంబంధించిన నైపుణ్యాలను వారికి నేర్పిస్తున్నట్లు సమాచారం 'పాకిస్థాన్‌లోని కరాచీకి సుమారు 50 కిలోమీటర్ల దూరంలో అరేబియా సముద్రంలో చర్నా ద్వీపం ఉంది. ప్రకృతి అందాలకు, సముద్రంలో సాహస క్రీడలకు ఈ ప్రాంతం ప్రసిద్ధి చెందింది. ముఖ్యంగా స్కూబా డైవింగ్, స్నార్కెలింగ్ కోసం పర్యాటకులు ఇక్కడికి వస్తుంటారు. ఇలాంటి ప్రాంతాన్ని ఎంచుకుని పర్యాటకుల ముసుగులో శిక్షణ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. ఈ శిక్షణ కార్యక్రమాల్లో పాకిస్థాన్‌కు చెందిన మార్కజీ ముస్లిం లీగ్ (పీఎంఎంఎల్) సభ్యులు శిక్షకులుగా వ్యవహరిస్తున్నట్లు నిఘా వర్గాలు తెలిపాయి

2008 నవంబర్ 26న లష్కరే తోయిబాకు చెందిన పది మంది ఉగ్రవాదులు సముద్ర మార్గంలో ముంబైకి చేరుకుని దాడులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో 166 మంది ప్రాణాలు కోల్పోయారు. అప్పట్లో కూడా ఉగ్రవాదులకు పాకిస్థాన్‌లోని మంగ్లా డ్యామ్ వద్ద శిక్షణ ఇచ్చినట్లు వెల్లడైంది. ఇప్పుడు మరోసారి సముద్రకార్యకలాపాలపై ప్రత్యేక శిక్షణ జరుగుతున్నట్లు సమాచారం రావడం భారత భద్రతా సంస్థల్లో ఆందోళన కలిగిస్తోంది. సముద్ర మార్గం ద్వారా ఎదురయ్యే ముప్పుపై భారత భద్రతా సంస్థలకు పూర్తి సమాచారం ఉందని, ఎలాంటి ప్రమాదం ఎదురైనా తగిన చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నాయని నిఘా వర్గాలు తెలిపాయి (26/11 వీబఎఝఱ ౫ఝఎఎం).మరోవైపు, జమ్మూకశ్మీర్‌లో కూడా లష్కరే తోయిబా కార్యకలాపాలపై అధికారులు దృష్టి సారించారు. యువతను సామాజిక మాధ్యమాల ద్వారా ఆకర్షించి ఉగ్రవాదంలోకి చేర్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు గుర్తించిన కౌంటర్ ఇంటెలిజెన్స్ కశ్మీర్ అధికారులు ఆరు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో డిజిటల్ పరికరాలు, పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

బాణసంచా విక్రయాలు, నిల్వలకు ముందస్తు అనుమతులు తప్పనిసరి:

జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా,
?జనావాసాలకు దూరంగా, బహిరంగ ప్రదేశాల్లోనే తాత్కాలిక దుకాణాలు
అగ్నిప్రమాద నివారణ చర్యలు పాటించకపోతే కఠిన చర్యలు
నిబంధనలు ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు తప్పవు --- జిల్లా ఎస్పీ హెచ్చరిక



అనకాపల్లి, నవంబర్:06(సత్యదీపిక ఉదయం బ్యూరో) ?దీపావళి పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, అగ్నిప్రమాదాలు జరగకుండా బాణసంచా తయారీ, నిల్వ గోదాములు, తాత్కాలిక దుకాణాల వద్ద వ్యాపారులు భద్రతా ప్రమాణాలు పాటించేలా క్షేత్రస్థాయిలో విస్తృతంగా తనిఖీలు చేపట్టాలని పోలీసు అధికారు లను అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశించారు.ఈ సందర్భంగా బాణసంచా వ్యాపారులు, నిర్వాహకులు పాటించాల్సిన కీలక నిబంధనలను జిల్లా ఎస్పీ వెల్లడించారుబాణసంచా నిల్వ, విక్రయాలు చేపట్టే వ్యాపారులు సంబంధిత శాఖల నుంచి ముందస్తుగా తాత్కాలిక లైసెన్సులు పొందాలి. అధీకృత (లైసెన్స్ పొందిన) హోల్‌సేల్ వ్యాపారుల వద్ద నుంచే సరుకు కొనుగోలు చేయాలి.నివాస ప్రాంతాలు, విద్యాసంస్థలు, ఆసుపత్రులకు దూరంగా.. పట్టణ, గ్రామీణ శివార్లలోని ఖాళీ బహిరంగ ప్రదేశాల్లో మాత్రమే తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేయాలి. ప్రమాద తీవ్రత తగ్గించేందుకు రెండు దుకాణాల మధ్య కనీసం 15 మీటర్ల దూరం పాటించాలి.
దుకాణాల నిర్మాణానికి అగ్నిని నిరోధించే ఆస్బెస్టాస్ లేదా జీఐ (జీఐ) రేకులను మాత్రమే ఉపయోగించాలి.ప్రతి షాపు వద్ద తగినంత నీరు, పొడి ఇసుక బస్తాలు, నిబంధనలకు అనుగుణంగా అగ్నినిరోధక పరికరాలు (ఫైర్ ఎక్స్‌టింగిషర్లు) అందుబాటులో ఉంచాలి.
ప్రజా రవాణా వాహనాలు లేదా ప్రయాణికులు ప్రయాణించే వాహనాల్లో బాణసంచాను రవాణా చేయడం చట్టరీత్యా నేరం.దుకాణాల వద్ద ఒకేసారి జనం గుమిగూడకుండా క్రమపద్ధతిలో కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకోవాలి. అగ్నిప్రమాద సూచనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలతో కూడిన హెచ్చరిక బోర్డులను ప్రదర్శించాలి. బాణసంచా నిల్వ ఉంచే గోదాముల్లో షార్ట్ సర్క్యూట్‌లు జరగకుండా సురక్షితమైన వైరింగ్, ఫైర్ అలారమ్‌లు, అత్యవసర సమయాల్లో రాకపోకలకు వేర్వేరు ద్వారాలు (ఎంట్రీ, ఎగ్జిట్) ఉండాలి.లైసెన్స్ గడువు ముగిసిన తర్వాత మిగిలిన బాణసంచాను జనావాసాలు లేదా ఇళ్లలో నిల్వ చేయడం నిషిద్ధం. వాటిని అధీకృత గోదాముల్లో మాత్రమే భద్రపరచాలి.
?నిబంధనలు ఉల్లంఘించినా, అనుమతి లేకుండా నిల్వలు ఉంచినా, జనావాసాల్లో బాణసంచా విక్రయించినా బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.

ఓడిపోయిన అభ్యర్థికి.. డబ్బు వెనక్కి ఇచ్చిన ఓటర్లు.!

- **ఓటుకు నోటు రాజకీయాలకు భిన్నంగా అమలాపురంలో అరుదైన ఘటన..**
- **అభ్యర్థి ఓటమితో తీసుకున్న నగదును తిరిగి అందజేసిన ఓటర్లు..**

అమలాపురం, నవంబర్ 6 (సత్య దీపిక ఉదయం విలేకరి) : ఎన్నికలంటే డబ్బుల పంపిణీ.. ఓటుకు నోటు అనే పరిస్థితులు కనిపిస్తున్న ప్రస్తుత రాజకీయాల్లో అమలాపురంలో చోటుచేసుకున్న ఓ ఘటన ప్రత్యేకంగా నిలిచింది. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మున్సిపల్ ఎన్నికల్లో ఓ అభ్యర్థి తనకు ఓటు వేయాలనే ఉద్దేశంతో కొంతమంది ఓటర్లకు నగదు అందజేశారు. అయితే ఎన్నికల్లో సదరు అభ్యర్థి ఓటమి చెందడంతో, ఆయన నుంచి తీసుకున్న నగదును ఓటర్లు తిరిగి అందజేశారు. అభ్యర్థి ఇంటికి వెళ్లి మరీ తాము తీసుకున్న మొత్తాన్ని తిరిగి ఇచ్చారు.

సాధారణంగా ఎన్నికల్లో గెలుపు కోసం అభ్యర్థులు నగదు పంపిణీ చేయడం, ఓటర్లు ఆ మొత్తాన్ని తీసుకోవడం చూస్తుంటాం. అందుకు పూర్తి భిన్నంగా అభ్యర్థి ఓడిపోయినప్పటికీ తీసుకున్న డబ్బును తిరిగి ఇవ్వడం అమలాపురంలో ప్రత్యేకంగా నిలిచింది. ఓటుకు వెల కట్టే రాజకీయాలకు భిన్నంగా వ్యవహరించిన ఓటర్ల తీరుపై స్థానికంగా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల్లో గెలుపోటములకంటే నైతిక విలువలకు ప్రాధాన్యత ఇచ్చిన ఈ ఘటన అందరి దృష్టిని ఆకర్షించింది.

కొత్తపేట డివిజన్ పరిధిలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- **7 మండలాలకు సంబంధించి స్ట్రాంగ్ రూములు, మూడు కౌంటింగ్ హాళ్ల విభాగాల కేటాయింపు**
- **పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య ఓట్ల లెక్కింపు నిర్వహించాలి**

జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్

కొత్తపేట, నవంబర్ 6.సత్య దీపిక ఉదయం ప్రతినిధి కొత్తపేట డివిజన్ పరిధిలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు.కొత్తపేట డివిజన్ పరిధిలోని రావులపాలెం, కొత్తపేట, ఆత్రేయపురం, ఆలమూరు, పి.గన్నవరం, అయినవిల్లి, అంబాజీపేట మండలాలకు సంబంధించి మొత్తం 145 ఎంపీటీసీ స్థానాలకు కౌంటింగ్ ఏర్పాట్ల ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు.ఆయా మండలాలకు సంబంధించి స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాళ్లను సంబంధిత ప్రభుత్వ భవనాలు, విద్యాసంస్థల్లో గుర్తించి కేటాయించినట్లు పేర్కొన్నారు.కౌంటింగ్ హాళ్ల విభాగాల వారీగా అందుబాటులో ఉన్న ప్రణాళికలో మొదటి కౌంటింగ్ హాల్‌కు 88 టేబుళ్లు, రెండవ కౌంటింగ్ హాల్‌కు 28 టేబుళ్లు, మూడవ కౌంటింగ్ హాల్‌కు 20 టేబుళ్లు కేటాయింపులు చూపించినట్లు తెలిపారు.కౌంటింగ్ నిర్వహణకు అవసరమైన గదులు, టేబుళ్లు, విద్యుత్, తాగునీరు, పారిశుధ్యం, సిబ్బంది ఏర్పాట్లను సంబంధిత అధికారులు పరిశీలించి పూర్తి చేయాలన్నారు.స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్టమైన పోలీసు భద్రత ఏర్పాటు చేయాలని, కౌంటింగ్ కేంద్రాల ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను నియంత్రించాలని సూచించారు.
కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతి ఉన్న వ్యక్తులను మాత్రమే గుర్తింపు కార్డుల ఆధారంగా అనుమతించాలని తెలిపారు.ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని, ఎన్నికల ఫలితాల అనంతరం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు
.కౌంటింగ్ ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాత వైఖరి పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు పూర్తయ్యేలా ఎన్నికల, రెవెన్యూ, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

కొత్తపేటలో కౌంటింగ్ నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపు

- **నవంబర్ 7న ఉదయం 7 నుంచి రాత్రి 9 గంటల వరకు ఆంక్షలు**
- **వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలి**
- **పోలీస్ శాఖ సూచనలు పాటించాలని విజ్ఞప్తి**

కొత్తపేట, నవంబర్ 6 (సత్య దీపిక ఉదయం):
ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో కొత్తపేటలో ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టినట్లు పోలీస్ శాఖ వెల్లడించింది. నవంబర్ 7వ తేదీన కొత్తపేట గ్రామంలో కౌంటింగ్ నిర్వహించనున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐపీఎస్ ఆదేశాల మేరకు, కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీ మోహన్ పర్యవేక్షణలో రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్. విద్యాసాగర్, కొత్తపేట ఎస్ఐ జి. సురేంద్ర ట్రాఫిక్ మళ్లింపు ఏర్పాట్లు చేశారు.

కౌంటింగ్ సందర్భంగా ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా నవంబర్ 7వ తేదీ ఉదయం 7 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయనున్నారు.రావులపాలెం నుంచి అమలాపురం వెళ్లే వాహనాలు రావులపాలెం--బోడిపాలెం బ్రిడ్జి--వాడపాలెం--అడ్డకాలువ--వానపల్లి-
-ముక్తేశ్వరం మీదుగా అమలాపురం చేరుకోవాలి.అమలాపురం నుంచి రావులపాలెం వెళ్లే వాహనాలు అమలాపురం--పలివెల వంతెన--పలివెల గ్రామం--గంటి చెక్‌పోస్ట్--ఈతకోట మీదుగా రావులపాలెం చేరుకోవాలని సూచించారు.వాహనదారులందరూ ట్రాఫిక్ మళ్లింపు మార్గాలను ముందుగానే గమనించి, తమ ప్రయాణాలను అందుకు అనుగుణంగా ప్రణాళిక చేసుకోవాలని పోలీసులు కోరారు. ట్రాఫిక్ నియంత్రణలో విధులు నిర్వహించే పోలీసు సిబ్బందికి సహకరించి, కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని పోలీస్ శాఖ విజ్ఞప్తి చేసింది.

ప్రభుత్వ ఉద్యోగులను కాంట్రాక్ట్ పద్ధతిలో తీసుకుంటే మేలు

అప్పుడే బాధ్యత తెలుస్తుందని సుప్రీంకోర్టు వ్యాఖ్య
పంజాబ్ ప్రధాన కార్యదర్శిపై కేసు కొట్టివేత
ఉద్యోగులు, పెన్షనర్ల డీఏ బకాయిలపై వివాదం
ధిక్కరణ కేసు నమోదుకు హైకోర్టు ఆదేశాలు



న్యూఢిల్లీ: ప్రభుత్వ ఉద్యోగులపై దేశ అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. "ప్రభుత్వ ఉద్యోగులు ఇకపై కాంట్రాక్ట్ పద్ధతిలోనే రావాలి. అప్పుడే వారు బాధ్యతగా వ్యవహరిస్తారు"అని జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఆర్.మహాదేవన్‌లతో కూడిన బెంచ్ వ్యాఖ్యానించింది. పంజాబ్, హర్యానా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు గురువారం విచారణ జరిపింది.

ఇందులో ఒక పిటిషన్ పంజాబ్ ప్రభుత్వ ఉద్యోగుల డీఏ, డీఆర్ బకాయిల చెల్లింపులకు సంబంధించినది. ఈ కేసులో హైకోర్టు పంజాబ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ఏ.పీ సిన్హాపై క్రిమినల్ కోర్టు ధిక్కరణ కేసు నమోదు చేసింది. రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సుప్రీంకోర్టులో సవాలు చేశారు. ఉద్యోగులు, పెన్షనర్ల డీఏ బకాయిలకు సంబంధించి హైకోర్టు ఇచ్చిన మరో ఆదేశాన్ని సవాలు చేస్తూ ఇంకో రెండు పిటిషన్లు కూడా సుప్రీంకోర్టులో దాఖలయ్యాయి.

మూడింటిపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు పంజాబ్ ప్రధాన కార్యదర్శి సహా పలువురు అధికారులపై క్రిమినల్ ధిక్కార చర్యలను నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేసింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంత వరకూ కేసు విచారణను నిలిపివేస్తూ తీర్పునిచ్చింది. ప్రధాన కార్యదర్శి వ్యక్తిగత హాజరుపై ఇచ్చిన హైకోర్టు ఆదేశాలనూ కొట్టివేసింది. పిటిషన్ల విచారణ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ.. "ప్రభుత్వ ఉద్యోగులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియమిస్తేనే వారికి నిజమైన బాధ్యత ఉంటుంది"అని వ్యాఖ్యానించింది.

ప్రస్తుతం పంజాబ్‌లో ఉన్న ప్రభుత్వం దాదాపు రూ.13,000 కోట్ల బకాయిలను గత ప్రభుత్వం నుంచి వారసత్వంగా పొందిందని రాష్ట్రం తరఫు న్యాయవాది బెంచ్ దృష్టికి తీసుకురాగా.. వచ్చే ఏడాది మార్చిలోగా ఎంత మొత్తం విడుదల చేయగలరో తెలపాలని కోరింది. "మీకు కొంత వెసలుబాటు ఇస్తున్నాం. సానుకూలంగా స్పందించండి"అని వ్యాఖ్యానించింది. తదుపరి విచారణను డిసెంబరు ఒకటవ తేదీకి వాయిదా వేసింది. ఆగస్టు మూడవ తేదీన హైకోర్టు ఉత్తర్వులను సవాలు చేసిన రాష్ట్ర ప్రభుత్వంతోపాటు పిటిషనర్లుపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోరాదని ప్రభుత్వానికి స్పష్టం చేసింది. పంజాబ్ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు చెల్లించాల్సిన కరవు భత్యం (డీఏ) బకాయిల వివాదం ఈ ఏడాది ఏప్రిల్‌లో పంజాబ్--హర్యానా హైకోర్టు ఇచ్చిన తీర్పుతో కీలక మలుపు తిరిగింది. డీఏ బకాయిల చెల్లింపు విషయంలో ప్రభుత్వం సూచించిన ప్రణాళికను హైకోర్టు సింగిల్ జడ్జి బెంచ్ తిరస్కరించింది. జూన్ 30లోపు ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులకు వర్తించే రేట్ల ప్రకారం ఉద్యోగులు, పెన్షనర్ల బకాయిలన్నీ విడుదల చేయాలని ఆదేశించింది. పంజాబ్ ప్రభుత్వం, పంజాబ్ స్టేట్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ ఈ ఆదేశాలను డివిజన్ బెంచ్ ముందు సవాలు చేశాయి. డివిజన్ బెంచ్ ఆగస్టు 3న ప్రభుత్వం అప్పీళ్లను కొట్టివేసింది. రెండు వారాల్లో బకాయిలు చెల్లించాలని ఆదేశించింది. అంతేకాకుండా, బకాయిలు పూర్తిగా చెల్లించే వరకు పత్రికలు, సోషల్ మీడియా వంటి మాధ్యమాల్లో భారీ ప్రకటనలపై ఖర్చులు చేయవద్దని కూడా స్పష్టం చేసింది. ఈ ఆదేశాలు అమలు కాలేదని ఉద్యోగులు, పెన్షనర్లు కొందరు మళ్లీ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు అక్టోబర్ 12న, ప్రధాన కార్యదర్శి కేఏపీ సిన్హాకు నోటీసు జారీ చేసింది. క్రిమినల్ ధిక్కరణ చర్యలు ఎందుకు ప్రారంభించకూడదో చెప్పాలని, వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కావాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో అదనపు ప్రధాన కార్యదర్శి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇప్పటికే సివిల్ ధిక్కరణ కేసులు పెండింగ్‌లో ఉన్నప్పుడు క్రిమినల్ కాంటెంప్ట్ చర్యలు ప్రారంభించడం సరికాదని వాదించారు.

తూర్పుపల్లి పోలింగ్ స్టేషన్ 25లో పోలింగ్ శాతం రికార్డు

నెల్లూరు: మండలంలోని తూర్పుపల్లి పోలింగ్ స్టేషన్ 25లో పోలింగ్ శాతం రికార్డు బద్దలు కొట్టింది. రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాలతో కూటమి నేతలు, పోలింగ్ అధికారులు ఏకంగా 104.27 శాతం పోలింగ్ నిర్వహించి చరిత్ర సృష్టించారు. గురువారం పోలింగ్‌కు ముందు మంత్రి ఆనం తన అనుచరులకు ఫోన్ చేసి వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను బయటకు నెట్టేసి రిగ్గింగ్ చేయాలని ఆదేశించారు. దీంతో రెచ్చిపోయిన టీడీపీ నేతలు బరితెగించి చేసిన రిగ్గింగ్ బట్టబయలైంది. తూర్పుపల్లిలోని పోలింగ్ స్టేషన్ 25లో మొత్తం ఓటర్లు 586 మంది ఉన్నాయి. ఇక్కడ వైఎస్సార్‌సీపీ తరఫున కూర్చున్న ఎన్నికల ఏజెంట్లను తొలి గంటలోనే బయటకు తరిమేశారు.

PRINTED , PUBLISHED & " and OWNER By, "S.S.RAO," And PRINTED at JS PRINTRS D.NO.2/720-7/1, -URBAN COLONY,TOWN &MANDAL ATMAKUR,NANDYAL Andhra Pradesh, pin: 518422, And Published At DOOR NO: 5-642,ABBIREDDY COLONY, KAMANAGURUVU VILLAGE,AMALAPURAM MANDAL, DR.B.R.AMBEDKAR KONASEEMA DISTRICT, ANDHRA PRADESH - 533201.,"Email ID," sdudayam@gmail.com" Editor & Pro S.S.RAOR.N.I. NO : APTEL/26/A4267 MOBILE NUMBER: 9440869757, 9160541579

కౌంటింగ్‌కు పటిష్ట బందోబస్తు..విజయోత్సవాలు, ర్యాలీలకు అనుమతి లేదు - జిల్లా ఎస్పీ రాహుల్ మీనా

కోనసీమలో కట్టుదిట్టమైన పోలీసు భద్రత.. సెక్షన్ 163 అమలు..

అమలాపురం, కొత్తపేటలో ట్రాఫిక్ మళ్లింపులు.. సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా..



అమలాపురం, నవంబరు 06 (సత్యదీపిక ఉదయం విలేకరి) : అంబేద్కర్ కోనసీమ జిల్లాలో నవంబర్ 7న జరిగే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో అమలాపురం, రామచంద్రపురం, కొత్తపేట కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐపీఎస్ తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద ఫ్రిస్కింగ్, గుర్తింపు కార్డుల తనిఖీలు, ప్రత్యేక నిఘా ఉంటాయని, అనుమతి ఉన్నవారిని మాత్రమే లోపలికి అనుమతిస్తామని పేర్కొన్నారు. సెక్షన్ 163, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున ఐదుగురికి మించి గుమిగూడరాదని, అనుమతి లేని సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించరాదని స్పష్టం చేశారు. ఎన్నికల ఫలితాల అనంతరం విజయోత్సవ ర్యాలీలు, బహిరంగ వేడుకలు, బాణసంచా కాల్చడానికి అనుమతి లేదని హెచ్చరించారు. నవంబర్ 7న అమలాపురంలో ఉదయం 5 నుంచి సాయంత్రం 7 గంటల వరకు, కొత్తపేటలో ఉదయం 7 నుంచి రాత్రి 9 గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేయనున్నారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలని, కేటాయించిన పార్కింగ్ ప్రదేశాల్లోనే వాహనాలు నిలపాలని పోలీసులు సూచించారు. మీడియా ప్రతినిధులు అధికారిక అనుమతి పత్రాలతోనే కౌంటింగ్ కేంద్రాల్లోకి వెళ్లాలని తెలిపారు. ఎన్నికల ఫలితాలపై అసత్య, విద్వేషపూరిత పోస్టులు ప్రచారం చేసినా, షేర్ చేసినా సంబంధిత వ్యక్తులు, అడ్మిన్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. కౌంటింగ్ ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు, అభ్యర్థులు, రాజకీయ నాయకులు, కౌంటింగ్ ఏజెంట్లు పోలీసులకు సహకరించాలని కోరారు.



పి.గన్నవరం, నవంబరు 06 (సత్యదీపిక ఉదయం విలేకరి) : : పి4 స్ఫూర్తితో నిరుపేద దివ్యాంగ కుటుంబానికి జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు అండగా నిలిచారు. మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేయడంతో పాటు, ఆ కుటుంబంలోని దివ్యాంగ బాలిక ఉన్నత విద్యకు పూర్తి సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. పి.గన్నవరం మండలం ముంజేటివారిపాలెం పరిధిలోని కఠారిలంక గ్రామానికి చెందిన కొమ్మన చిన సత్యనారాయణ దివ్యాంగుడు. ఆయన భార్య తీవ్ర అనారోగ్యంతో మృతి చెందగా, ఇద్దరు కుమార్తెలు కూడా దివ్యాంగులే. కుటుంబం ఎన్నో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోంది. తల్లి తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలోనూ పట్టుదలతో చదివిన పెద్ద కుమార్తె కొమ్మన శ్రీ మంజు వెంకట మహాలక్ష్మి ప్రభుత్వ పాఠశాలలో 867 మార్కులు సాధించింది. ఈ బాలిక ప్రతిభ, కుటుంబ పరిస్థితులపై పత్రికల్లో వచ్చిన వార్తను చూసి చలించిన జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు ఆ కుటుంబాన్ని పి4 స్ఫూర్తితో దత్తత తీసుకున్నారు. ఇందులో భాగంగా కఠారిలంక గ్రామానికి వెళ్లి మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను అందజేశారు. కుటుంబ సభ్యులతో కొద్దిసేపు గడిపి వారి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల మంజు మహాలక్ష్మికి రెండు కాళ్లకు శస్త్రచికిత్స జరిగిన విషయం తెలుసుకున్న డీటీఓ ఆమెను పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ధైర్యంగా ఉండాలని, చదువును మధ్యలో ఆపవద్దని సూచించారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశం కోసం కళాశాల యాజమాన్యంతో మాట్లాడానని, ఆమె చదువు బాధ్యతను తాను తీసుకుంటానని తండ్రి చిన సత్యనారాయణకు భరోసా ఇచ్చారు. కుటుంబానికి ఎలాంటి ఇబ్బంది ఎదురైనా తనకు ఫోన్ ద్వారా తెలియ జేయాలని, అన్ని విధాలా అండగా ఉంటానని దేవిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. కష్టాల్లో ఉన్న కుటుంబానికి ఆర్థిక సాయంతో పాటు విద్యాభరోసా కల్పించడం పలువురి ప్రశంసలు అందుకుంటున్నారు.

అమలాపురం డివిజన్‌లో 196 కౌంటింగ్ టేబుళ్ల ఏర్పాటు..21 కౌంటింగ్ హాళ్లు సిద్ధం

స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు భద్రత..

అధికారులకు జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ ఆదేశాలు..



అమలాపురం, నవంబరు 06 (సత్యదీపిక ఉదయం విలేకరి) : అమలాపురం డివిజన్ పరిధిలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అమలాపురం పట్టణంలోని ఎస్.కె.బి.ఆర్. కళాశాలలో కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. డివిజన్ పరిధిలోని అమలాపురం, ఉప్పలగుప్తం, అల్లవరం, ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన, మలికిపురం, సఖినేటిపల్లి, మామిడికుదురు, రాజోలు మొత్తం పది మండలాలకు సంబంధించి 196 ఎంపీటీసీ స్థానాల ఓట్ల లెక్కింపు కోసం 196 కౌంటింగ్ టేబుళ్లను ఏర్పాటు చేయాలని ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. ఇందుకోసం కళాశాలలోని జూలజీ, కామర్స్, డి.ఈడి, బి.ఈడి, ఎన్.సి.సి బ్లాకుల్లో స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాళ్లను కేటాయించారు. మండలాల వారీగా మొత్తం 21 కౌంటింగ్ హాళ్లను సిద్ధం చేయనున్నట్లు పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో అవసరమైన టేబుళ్లు, సిబ్బంది నియామకం, నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు, పారిశుధ్యం తదితర మౌలిక సదుపాయాలను ముందుగానే సమకూర్చాలని అధికారులకు సూచించారు. స్ట్రాంగ్ రూముల వద్ద నిరంతర పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు కౌంటింగ్ కేంద్రాల పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి నిబంధనల ప్రకారం అనుమతి పొందిన అధికారులు, సిబ్బంది, అభ్యర్థులు, ఏజెంట్లను మాత్రమే అనుమతించాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, విజయోత్సవాలు, ఊరేగింపులు, బహిరంగ సమావేశాల విషయంలో నిబంధనల ఉల్లంఘనలు జరగకుండా పోలీసు, ఎన్నికల అధికారులు సమన్వయంతో పర్యవేక్షించాలని సూచించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వ యంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.





రామాయణ కథ - శుద్ధపరబ్రహ్మ స్వరూప సాక్షాత్కార సాధనా సోపానములు

(గత సంచిక తరువాయి) అక్కడ నుండి వెళ్ళిపోయేటప్పుడు సీతారామలక్ష్మణులు సుతీక్షణ మహర్షికి సాష్టాంగపడి నమస్కరిస్తారు. మహర్షి రామలక్ష్మణులను కౌగలించుకుంటాడు. మీరు దండకారణ్యంలో వెళ్ళే మార్గంలో ఇదే దారిలో ఎన్నో ఆశ్రమాలు మీకు స్వాగతం ఇస్తాయి. అవి చాలా సుందరంగా యుండి అన్ని సౌకర్యాలతో మీకు ఆనందం కలిగిస్తాయి. మీరు ఈ ఆశ్రమాన్ని మళ్ళీ మళ్ళీ వస్తుండాలి అని చెప్పి సాగనంపుతాడు. సాధకుడు సుతీక్ష సాధనయందాసక్తి చూపడమే సుతీక్షణ మహర్షికి సాష్టాంగ నమస్కారం చేయడం. కౌగిలింతకు అర్థం ఏమనగా ఈ సుతీక్షణ సాధనలో ప్రశాంతత యుంటుందని, ఆనందాన్ని ఇస్తుందనీ, అన్ని సౌకర్యాలు యుంటాయని అర్థం. మళ్ళీ మళ్ళీ ఈ ఆశ్రమాన్ని రావాలని, అనగా ఏ విఘ్నాలు వచ్చినా సాధనా తీవ్రతను విడవకుండా మరలా మరలా తీవ్రతర సాధన చేస్తూనే ఉండాలి అని సాధకునకు చేసే హెచ్చరికగా ఇది అన్వయించుకోవాలి.

సాధకుడు తన సాధనలకు విఘ్నం రాకుండా ఎప్పుడూ జాగరూకత కలిగి ఉండాలనీ, విఘ్నాలు చేసే వ్యతిరేకశక్తులు తన లోపల ఉన్నాయంటేనే చాలు అవి ఎప్పుడైనా విజృంభించి సాధకుడు పరాకుగా యున్న సమయంలో సాధకునికి అవరోధాలు కల్పిస్తాయి. కావున వాటికి తనలో చోటు లేకుండా చేసి, వెదకి వెదకి నాశనం చెయ్యాలి. అనగా మనసు ఇంద్రియాల సహాయంతో సాధకునికి విఘ్నాలు కల్పిస్తుంది. కావున మనస్సును అమనస్కస్థితికి చేర్చాలనేది ఇందులోని అంతరార్థం. రాక్షసులు అనగా రక్షణను నాశనం చేసే ప్రతీపశక్తులు. రాముడు ముందు నడుస్తున్నాడు. మధ్యన సీత నడుస్తున్నది. లక్ష్మణుడు ధనుర్ధారియై వెనుకు నడుస్తున్నాడు. అనగా సమరాత్మకు (రామునికి) జీవాత్మకు (లక్ష్మణుడు) మధ్యన ప్రకృతి (సీత) యుంటుందనీ, పరమాత్మవైపు ప్రకృతిని నడిపించడానికి జీవునికి ఎట్టి అవరోధాలు రాకుండా కనిపెట్టుకుని వుండాలనేది ఇందులో అంతరార్థం. పరమాత్మను దర్శించడానికి జీవునకు ప్రకృతి వాసనలు అడ్డుగా ఉంటాయనీ, జీవుడు ఆ ప్రకృతిని పరమాత్మలో లీనం చేసి ప్రకృతి పురుషులు. ఒక్కటే నన్ను భావనను అలవరచుకోవడానికి ఇతర భావనలు ఆటంకంగా వస్తాయని కావున ఆ ఇతర భావనలను ఎప్పటికప్పుడు నశింపు చేసుకుంటూ అమనస్కుడవ్వాలి సాధకుడు అనేది ఇందులో రహస్యం.

చాలా దూరం నడిచి వెళ్ళేక సీతారామలక్ష్మణులకు యోజనాయుతమైన తటాకాన్ని చూసేరు. దాని నుండి సంగీతవాద్యాలు వినిపించాయి. రామలక్ష్మణులు కుతూహలం కల్గి అక్కడ యున్న ధర్మభృతుడు అనే మహర్షిని అదేమిటని అడిగేరు ధర్మభృతుడు ఇలా చెప్పాడు. ఇది పంచసరస్సు అనే పేరుగల తటాకము. ఇది ఎప్పుడూ యుంటుంది. మాండకర్ణి అనే మునిచే నిర్మింపబడింది. అతడు వాయుభక్షకుడుగా, జలాశ్రయుడుగా దశవర్ష సహస్రములు తీవ్రంగా తపస్సు చేశాడు. దాని వల్ల దేవతలలో కలవరం ఏర్పడి, ఇతడు దేవతాస్థానం కోసం తపస్సు చేయుచున్నాడని తలచి అతన్ని తపోభ్రష్టునిగా చేయడానికి అయిదుగురు ప్రధాన అప్సరసలను పంపారు. అప్సరసలు మాండకర్ణిని ఆకర్షించి అతన్ని మదనాతురణ్ణి చేసి క్రీడిస్తున్నారు. వారికోసం ఈ తటాకంలో ఇల్లు నిర్మింపబడింది. వారి క్రీడావిన్యాసంలో గీతవాద్రిత సంగీత స్వరాలు శ్రీ వినిపించుతున్నవి అని ధర్మభృతుడు చెప్పెను. రాముడు చాలా దూరం నడిచి వెళ్ళాక యోజనా యుతమైన తటాకాన్ని చూసాడు. అనగా సాధకుడు చాలా తీవ్రంగా సాధన చేస్తుంటే అతని ఆలోచనలో ఒక దుఃఖాన్ని కల్గించే ఐహిక వాసనా దృశ్యం కన్పించింది. పంచ సరస్సులు గల తటాకం అనగా పంచేంద్రియములు యొక్క ప్రవాహం కలిగిన దేహం అని అర్థం. అయిదు ఇంద్రియాలతో మాయతో సంచరించే దేహం. యోజనాయుతం అనగా ఒకదాని తర్వాత ఒకటి వచ్చే ఆలోచనలు. మాండకర్ణిముని అనగా విలాస అనుభవాలకోసం అశాశ్వత సుఖాలను కోరుకునే జీవుడు దశవర్ష సహస్రములు అనగా పది ఇంద్రియాల వృత్తులతో అనేక కష్టసుఖాలు కోసం జీవుడు శ్రమపడేదశ. వాయుభక్షకుడు అనగా ప్రాణవాయువును వ్యర్థంగావించుకునేవాడు. అనగా ప్రాణాలను తృజించి సుఖాలకు కృషి చేసేవాడని అర్థం. జలాశ్రయుడు అనగా మాయ యొక్క ఆశ్రయం కలవాడు. జలంలో దిగితే శరీరం కన్పించదు. అటులనే మాయలో మునిగి తన స్వస్వరూపం కన్పించకుండా చేసుకున్నవాడని అర్థం. ఈ విధంగా మాయలోపడ్డ జీవుడు శాశ్వతమైన మోక్షాన్ని వదులుకొని అశాశ్వతములైన సుఖాభిలాషలు తీర్చుకోవడం కోసం పది ఇంద్రియాల బారినబడి శ్రమపడి పంచజ్ఞానేంద్రియముల సుఖములకు ఆరాటపడతాడు అని దీని అర్థం. దేవతలు వాని తపస్సును భగ్నం చేయడానికి అయిదుగురు ప్రధాన అప్సరసలను పంపారు. అనగా అతనిలోని అశాశ్వత సుఖాభిలాషను చూసి తమ వినాశనానికి భయపడి అతనిలోని ఇంద్రియలోలతకై ప్రధాన పంచేంద్రియాలు విజృంభించి అతన్ని మరింత భ్రష్టున్ని చేయడానికి పంచఅప్సరసలుగా వచ్చాయని అర్థం. ఆ పంచేంద్రియాలతో సుఖాల్ని అనుభవించడమే సంగీత స్వరాలు విన్పించడంగా అంతరార్థం చెప్పుకోవాలి. కావున సాధకునిలోని సాధనతీవ్రతను పెంచి జాగ్రత్తపడటానికి ఈ కథ వాల్మీకి మహర్షిచే కల్పితమయినది అని అర్థం.

దండకారణ్యాశ్రమాలలో సుఖంగా రాముడు పది సంవత్సరాలు గడిపేడు. ఒకదాని తర్వాత ఒకటిగా ఆయా ఆశ్రమాలలో మూడుమాసాలు, నాలుగు మాసాలు, అయిదుమాసాలు, ఆరు మాసాలు, ఎనిమిది మాసాలు, ఒకచోట మాసంపైగా కొన్నాళ్ళు, ఒక్కొక్కచోట మాసంలో సగం రోజులు, మరొకచోట అంతకన్న ఎక్కువ రోజులు గడిపి సీతాలక్ష్మణులతో ధర్మజ్ఞుడైన రాముడు సుతీక్షుని ఆశ్రమాన్ని తిరిగి వచ్చాడు. అనగా పది సంవత్సరాలనగా పది ఇంద్రియాల వ్యాపారాన్ని . ద్రవింప చేసి, ఓడించివేసి, ఇంద్రియ వాసనలను నశింపచేసి, మూడు మాసాలు అనగా గుణ త్రయం అణచివేశాడని, నాల్గు మాసాలు అనగా బ్రహ్మచర్య, గార్హస్థ్య, వానప్రస్త, సన్యాసములనే నాల్గు ఆశ్రమాలని. ఐదు మాసాలనగా పంచభూత ప్రకృతులనీ, ఆరుమాసాలు అంటే అరి షడ్వార్గాలని, ఎనిమిది మాసాలు అనగా అష్టధాతువులు, లేక అష్టమధాలనీ, ఏకమాసం అనగా అహంకారం అనీ, మాసార్ధం అంటే మమకారం అనీ అర్థం చేసుకోవాలి. ఈ విధంగా మనో వృత్తులను ద్రవింపచేసి పది ఇంద్రియాలలోనూ చాంచల్యం లేకుండా వుండే స్థితిని సాధకుడు సాధించాడు అని, ఆ సాధనలను తిరిగి తిరిగి తీవ్రస్థాయిలో జపిస్తుండాలనీ అంతరార్థం. ఏ ఒక్క అవకాశం దొరికినా మరలా మరలా విజృంభించకుండా జాగరూకతతో యుండాలి అని అర్థం. గుణత్రయాన్ని, చతురాశ్రమాలను, పంచభూతాల ప్రకృతులను, అరిషడ్వర్గములను, అష్ట ధాతులను, అహంకార మమకారములను మాయాప్రకృతి, లేని వానినిగా చేయడమే ఆయా ఆశ్ర మాలలో ఉండటానికి అర్థంగా చెప్పుకోవాలి. **(ఇంకా ఉంది)**

దీపావళి షాపులపై ఉన్న శ్రద్ధ.. ప్రజల వీధులపై ఏదీ?

చెత్త కుప్పలతో కంపిస్తున్న కాకినాడ వీధులు.. మున్సిపాలిటీ పనితీరుపై ప్రజల ఆగ్రహం!



కాకినాడ నవంబర్ 6 (సత్య దీపిక ఉదయం బ్యూరో) – కాకినాడ నగరంలో పారిశుధ్య నిర్వహణపై మున్సిపల్ కార్పొరేషన్ నిర్లక్ష్యం మరోసారి చర్చనీయాంశంగా మారింది. గత తుఫాను ప్రభావం తర్వాత నుంచి నగరంలోని పలు వీధుల్లో చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజులుగా చెత్త తొలగించకపోవడంతో రోడ్ల పక్కన ఎక్కడ చూసినా చెత్త, ఎండిపోయిన కొబ్బరి ఆకులు, ఇతర వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. చెత్త తొలగించేందుకు ట్రాక్టర్లు రావడం లేదని స్థానికులు ప్రశ్నిస్తే.. దీపావళి సందర్భంగా బాణసంచా దుకాణాల కోసం షెడ్ల ఏర్పాటులో ట్రాక్టర్లు బిజీగా ఉన్నాయని సమాధానం వస్తోందని వారు చెబుతున్నారు. దీపావళి షాపుల ఏర్పాటుకు మున్సిపాలిటీ చూపిస్తున్న శ్రద్ధలో కనీసం కొంతైనా ప్రజల ఆరోగ్యం, వీధుల పరిశుభ్రతపై చూపించలేరా? పండుగ ఏర్పాట్లు ఎంత ముఖ్యమో, ప్రజలు నివసించే ప్రాంతాల్లో పారిశుధ్యం కూడా అంతే ముఖ్యమని స్థానికులు గుర్తుచేస్తున్నారు. దీపావళి షాపుల ఏర్పాట్లకు ప్రాధాన్యత ఇస్తూనే నగర పారిశుధ్యాన్ని విస్మరించకూడదని, వెంటనే చెత్త కుప్పలను తొలగించి, ప్రతి వీధిలో పారిశుధ్య పనులు చేపట్టాలని ప్రజలు కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను కోరుతున్నారు.

ప్రజాప్రతినిధులకు కామాక్షి దేవి పీఠం ఘన సత్కారం

చైర్మన్ నల్లా శ్రీధర్‌తో పాటు ఇద్దరు కౌన్సిలర్లకు సత్కారం..



అమలాపురం, నవంబరు 07 (సత్యదీపిక ఉదయం విలేకరి) : అమలాపురం మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో విజయం సాధించిన మున్సిపల్ చైర్మన్ నల్లా శ్రీధర్‌తో పాటు 27వ వార్డు కౌన్సిలర్ దంగేటి విజయ గౌరి, 28వ వార్డు కౌన్సిలర్ మోకా వెంకట సుబ్బారావులను శుక్రవారం కామాక్షి దేవి పీఠం వద్ద ఘనంగా సన్మానించారు. శ్రీ కామాక్షి దేవి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విజేతలకు సభ్యులు శాలువాలు కప్పి సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నూత నంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీఠం సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఓట్ల లెక్కింపునకు పక్కా ఏర్పాట్లు !



అమలాపురం, నవంబరు 07 (సత్యదీపిక ఉదయం విలేకరి) : అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలలో శనివారం నిర్వహించనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. తొలుత అన్ని ఎంపీటీసీ స్థానాలకు సంబంధించిన బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ టేబుళ్ల వద్దకు తరలించి, ఎంపీటీసీకి సంబంధించిన పింక్ బ్యాలెట్లు, జడ్పీటీసీకి సంబంధించిన తెలుపు బ్యాలెట్లను వేరు చేస్తారు. అనంతరం వాటిని ప్రత్యేక డ్రమ్‌లలో వేసి కలిపి, కేటాయించిన టేబుళ్ల వద్ద ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. మొత్తం కౌంటింగ్ టేబుళ్లలో సగం ఎంపీటీసీ ఓట్ల లెక్కింపునకు, మిగిలిన సగం జడ్పీటీసీ ఓట్ల లెక్కింపునకు కేటాయించారు. ఒక్కో రౌండ్‌లో సుమారు వెయ్యి ఓట్లను లెక్కించేలా ఏర్పాట్లు చేసినట్లు రిటర్నింగ్ అధికారి అన్యం రాంబాబు తెలిపారు. ఆయా ఎంపీటీసీ స్థానాల్లో పోలైన ఓట్ల సంఖ్యను బట్టి రెండు నుంచి మూడు రౌండ్లలో లెక్కింపు పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. కౌంటింగ్ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన వివరించారు.





శ్రద్ధాంజలి

నిర్మలమైన హృదయంతో ఉన్నతమైన
వ్యక్తిత్వాన్ని అణువణువునా
నింపుకొన్న మహోన్నతవ్యక్తి
శ్రీ అప్పారి భాస్కరరావు గారి
మృతికి చింతిస్తూ, వారి
కుటుంబ సభ్యులకు మా
ప్రగాఢ సానుభూతిని
తెలియజేస్తూ...

చాల్లంగి సత్యనారాయణ
Ex. పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఇందుపల్లి

చాల్లంగి సోమేశ్వరరెడ్డి
కాంట్రాక్టర్, ఇందుపల్లి

చాల్లంగి శివాలినిఅప్పాజి
మాజీ సర్పంచ్, ఇందుపల్లి

బాంతు వెంకట
సూర్యనారాయణ, మందమర్రి

బొక్కా సత్యనాగ
వరప్రసాద్, హైదరాబాద్

విత్తనాల విద్యాధరరావు
హైదరాబాద్

అప్పారి రవికిరణ్
లండన్

అప్పారి కిరణ్
హైదరాబాద్

Sanpra
synthesis pvt ltd
Driven by... Innovation

Md. Appari Ravindranath & Staff, Vizag, Hyderabad



జాతీయ తెలుగు దినపత్రిక

సత్య దీపిక

ఉదయం

www.satyadeepikaudayam.com

తెలంగాణ ప్రజల గొంతుక ..నిజాలు వెలుగుల్లోకి

ప్రభుత్వ లక్ష్యాల సాధనలో జిల్లాల పనితీరు మెరుగుపడాలి



- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు- జనవరి మొదటి వారంలోగా సమగ్ర శిక్ష, పీఎం శ్రీ నిధుల వినియోగం గరిష్ట స్థాయికి చేరాలి - మార్చి నెలాఖరు నాటికి విబిజీరాంజీ ద్వారా 12 కోట్ల పనిదినాల కల్పన లక్ష్యం - వేసవి కాలం ముగిసే వరకు తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత - ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ఇసుక, సిమెంట్ రాయితీలను లబ్ధిదారులకు అందించాలి - కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో జిల్లా పనితీరును మెరుగుపరచాలి - విద్య శాఖ పని తీరు , ఇందిరమ్మ ఇండ్లు , త్రాగు నీటి సరఫరా తదితర అంశాల పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన సీఎస్

9/లో

ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలి



- వి బి జి రామ్ జీ పథకం క్రింద చేపట్టే పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

- వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామీణ ప్రాంతాలలో త్రాగునీటి కొరత ఏర్పడకుండా ముందస్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి - చేయూత పింఛన్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలి - అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ పె ండింగ్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి - రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

9 లో



- 1 వేయి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి చర్యలు - పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యం - 7 కోట్ల రూపాయలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు - 200 కోట్ల రూపాయల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్

మందమర్రి అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

నిర్మాణం - మందమర్రిలో 50 పడకల ఆసుపత్రి నిర్మాణానికి చర్యలు - మందమర్రి మున్సిపాలిటీలోని అన్ని వార్డులలో సి.సి. రోడ్లు, మురుగునీటి వ్యవస్థలను అభివృద్ధి చేసేందుకు పనులు చేపట్టాం - రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద

10లో

విద్యార్థుల్లో పరిశోధనాత్మక ఆలోచనలకు జిజ్ఞాస వేదిక

- రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఐదు బృందాలకు బహుమతుల ప్రదానం - విద్యార్థులు క్షేత్రస్థాయి సమస్యలకు పరిష్కారాలు చూపేలా ప్రాజెక్టులు రూపొందించాలి - జిల్లా కలెక్టర్ రాజర్షి షా

అదిలాబాదు ప్రతినిధి,సత్యదీపిక ఉదయం :



విద్యార్థుల్లో నూతన ఆలోచనలు, పరిశోధనాత్మక దృక్పథం, ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించేందుకు జిజ్ఞాస ప్రాజెక్టులు ఎంతగానో దోహదపడుతున్నాయని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు.రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన విద్యార్థులకు శుక్రవారం స్థానిక ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ ఐదు విజేత బృందాలకు నగదు బహుమతుల చెక్కులు అందజేసి అభినందించారు. (మిగితా...8లో)

ఈవీఎం, వీవీప్యాట్ యంత్రాల గోదాంను తనిఖీ

అదిలాబాదు ,నవంబర్ 06,సత్యదీపిక ఉదయం :

ప్రతి నెల తనిఖీలో భాగంగా శుక్రవారం స్థానిక శాంతినగర్‌లోని ఈవీఎం, వీవీప్యాట్ యంత్రాల గోదాంను జిల్లా కలెక్టర్ రాజర్షిషా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో జిల్లా ఎన్నికల విభాగం పర్యవేక్షణ అధికారి నలంద ప్రియ, నాయబ్ తహసీల్దార్ మధుసూదన్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మద్యానికి నో.. డ్రగ్స్‌కు దూరం..

చెన్నూర్ ,సత్యదీపిక ఉదయం :



సంపూర్ణ మద్యపాన నిషేధిత గ్రామంగా లింగంపల్లిని తీర్చిదిద్దేందుకు లింగంపల్లి గ్రామస్తులు కీలక నిర్ణయం తీసుకున్నారు.మద్యపానాన్ని పూర్తిగా నిషేధించాలని మహిళలు, యువత, గ్రామస్తులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించి మద్యపానం,మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.అంతేకాకుండా గ్రామస్తులందరూ ఒక్కతాటిపైకి వచ్చి మద్యం, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని, వాటి విక్రయాలు, వినియోగాన్ని గ్రామంలో పూర్తిగా ప్రోత్సహించబోమని ప్రతిజ్ఞ చేశారు.గ్రామంలో ఇకపై ఎలాంటి బెల్ట్ షాపులు ఉండకూడదని, ఎవరైనా గుడుంబా తయారు చేసినా, విక్రయించినా రూ.10 వేల జరిమానా విధించాలని తీర్మానించారు.మద్యపాన నిషేధిత గ్రామంగా లింగంపల్లిని తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మహిళలు, యువత పిలుపునిచ్చారు. ఈ మేరకు గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు.మద్యం, మత్తు పదార్థాల కారణంగా యువత భవిష్యత్తు, కుటుంబాల జీవనం దెబ్బతినకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని.. బెల్ట్ షాపులు, గుడుంబా విక్రయాలు, డ్రగ్స్ అక్రమ రవాణాపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ అంగ రమేష్, ఉప సర్పంచ్ జీల్ల తిరుపతి ,గ్రామ పంచాయతీ పాలక వర్గ సభ్యులు,గ్రామ యువత, మహిళలు,పంచాయతీ కార్యదర్శి కమలాకర్,ఐకెపి సిబ్బంది ,అంగన్వాడీ టీచర్ మరియు చెన్నూరు మండల విద్యాధికారి సత్యనారాయణ ఁ పాఠశాల ఎవీ సిరంగి రవీందర్ పాల్గొన్నారు.

టీజీపీఎస్సీ పరీక్షా కేంద్రాలను పరిశీలించిన అడిషనల్ డీసీపీ (పరిపాలన)

- జేఎన్టీయూ, మదర్ థెరిసా ఇంజనీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రాల సందర్శన - పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా భద్రతా ఏర్పాట్లు- అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి: అడిషనల్ డీసీపీ (పరిపాలన) కె. శ్రీనివాస్

గోదావరిఖని,నవంబర్06,సత్యదీపిక ఉదయం :

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో టీజీపీఎస్సీ పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు చేపట్టిన భద్రతా ఏర్పాట్లను అడిషనల్ డీసీపీ (పరిపాలన) కె. శ్రీనివాస్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.రామగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో,పెద్దపల్లిలోని మదర్ తెరిసా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన టీజీపీఎస్సీ పరీక్షా కేంద్రాలను ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాల్లో చేపట్టిన భద్రతా చర్యలు,పోలీస్ బందోబస్తు,పరీక్షల నిర్వహణకు చేసిన ఏర్పాట్లను ఆయన సమీక్షించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు.అదేవిధంగా పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని, పరీక్షా కేంద్రాల వద్ద శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.



అధికారులతో సమన్వయం చేసుకుంటూ పథకాల అమలును వేగవంతం చేయాలి

నిర్మల్ ప్రతినిధి,సత్యదీపిక ఉదయం :

- పీఎం శ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన - విద్యార్థుల హాజరు శాతం పెంచాలి - జిల్లా, మండల స్థాయిలో తాగునీటి కమిటీలను ఏర్పాటు చేయాలి - గ్రామాల్లో అవసరమైన పనులను గుర్తించి కూలీలకు విస్తృతంగా ఉపాధి కల్పించాలి - ప్రభుత్వ రాయితీలు పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు చేరేలా పర్యవేక్షించాలి - రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలులో నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో సాధించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ,విద్య, ఉపాధి హామీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, తాగునీటి సరఫరా, చేయూత పింఛన్ల పరిశీలన తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి జిల్లాలో ప్రభుత్వ లక్ష్యాల సాధనకు కృషి చేయాలని శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సూచించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాల అమలు, నిధుల వినియోగం, నిర్దేశిత లక్ష్యాల పురోగతిపై ప్రధాన కార్యదర్శి సమీక్షించారు.సమగ్ర శిక్ష అభియాన్, పీఎం శ్రీ పథకాల కింద మంజూరైన నిధులను జనవరి మొదటి వారంలోగా గరిష్ట స్థాయిలో వినియోగించాలని సీఎస్ సూచించారు. పీఎం శ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, ఇతర మరమ్మతు పనులను చేపట్టాలని, విద్యార్థుల హాజరు శాతం పెంచాలని సూచించారు. మధ్యాహ్న భోజనం, అల్పాహార పథకాలను నాణ్యతతో అమలు చేయాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికే విద్యార్థులకు యూనిఫారాలు, కిట్లు అందేలా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు.వేసవి కాలం ముగిసే వరకు ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందించడమే ప్రధాన ప్రాధాన్యతగా ఉండాలని సీఎస్ స్పష్టం చేశారు. జిల్లా, మండల స్థాయిలో తాగునీటి కమిటీలను ఏర్పాటు చేసి ప్రతి వారం సరఫరా పరిస్థితిని సమీక్షించాలని సూచించారు. నవంబర్ 15లోగా చేతిపంపులు, బోర్లు, బహిరంగ బావులకు సంబంధించిన మరమ్మతులు పూర్తి చేయాలని, నవంబర్ 15 నుంచి డిసెంబర్ 31 వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి తాగునీటి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని ఆదేశించారు. మిషన్ భగీరథ పైపులైన్లలో లీకేజీలు, ప్రెజర్ వాల్వ్‌లను నిరంతరం పర్యవేక్షించాలని, అక్రమ కనెక్షన్లు, నీటి వృథాను అరికట్టాలని తెలిపారు.వి బి జి రామ్ జి పథకం కింద చేపట్టే పనులను నాణ్యతతో అమలు చేస్తూ మార్చి నెలాఖరు నాటికి 12 కోట్ల పనిదినాల లక్ష్యాన్ని సాధించాలని సీఎస్ సూచించారు. గ్రామాల్లో అవసరమైన పనులను గుర్తించి కూలీలకు విస్తృతంగా ఉపాధి కల్పించాలని, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని, ప్రజాప్రతినిధులు, ఇందిరమ్మ కమిటీలతో సమన్వయం చేసుకుంటూ అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేయాలని సీఎస్ ఆదేశించారు. పూర్తయిన ఇళ్లకు 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక లోగో స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని సూచించారు.ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక అందించేలా 'మన ఇసుక -- మన వాహనం' యాప్‌ను సమర్థవంతంగా వినియోగించాలని, రవాణా ఖర్చులు మాత్రమే వసూలు చేయాలని తెలిపారు. అలాగే లబ్ధిదారులకు సిమెంట్ బస్తాను రూ.230కే అందించేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ రాయితీలు పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు చేరేలా పర్యవేక్షించాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో ప్రతి జిల్లా మెరుగైన ఫలితాలు సాధించాలని, ముఖ్యమంత్రి డాష్‌బోర్డులో నమోదైన అంశాలపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సీఎస్ సూచించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు విస్తృతంగా చేరవేసేందుకు సోషల్ మీడియాను సమర్థవంతంగా వినియోగించాలని తెలిపారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్‌తో కలిసి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విజయలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారి బోజన్న, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ట్రాన్స్‌జెండర్ల హక్కులు, రక్షణపై అవగాహన కార్యక్రమం

ట్రాన్స్‌జెండర్ల హక్కులు, చట్టపరమైన రక్షణపై అవగాహన కల్పించిన పోలీసులు

పెద్దపల్లి,సత్యదీపిక ఉదయం : రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు



ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం,హక్కుల పరిరక్షణ, చట్టపరమైన రక్షణపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.శుక్రవారం పెద్దపల్లి మహిళా పోలీస్ స్టేషన్ ఆవరణలో పెద్దపల్లి జిల్లా పరిధిలోని ట్రాన్స్‌జెండర్లకు ట్రాన్స్‌జెండర్ ప్రొటెక్షన్ సెల్ పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జ్, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రమేష్ బాబు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల (హక్కుల పరిరక్షణ) చట్టం--2019 ప్రకారం ట్రాన్స్‌జెండర్లపై ఎలాంటి వివక్ష, వేధింపులకు తావులేదని తెలిపారు. విద్య, ఉపాధి, నివాసం తదితర అంశాల్లో వారికి చట్టపరమైన రక్షణ కల్పించబడుతుందని వివరించారు. ఎవరైనా అవమానించినా, వేధించినా లేదా తమ హక్కులకు భంగం కలిగించినా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ట్రాన్స్‌జెండర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పోలీసు శాఖ దృష్టికి తీసుకువస్తే, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలోని ట్రాన్స్‌జెండర్ ప్రొటెక్షన్ సెల్ ద్వారా వారి భద్రత, సంక్షేమం కోసం అవసరమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అలాగే ట్రాన్స్‌జెండర్ల హక్కులు, చట్టపరమైన రక్షణపై అవగాహనను సోషల్ మీడియా వేదికల ద్వారా కూడా విస్తృతంగా ప్రచారం చేస్తున్నట్లు పేర్కొన్నారు.ట్రాన్స్‌జెండర్ల పట్ల ఎలాంటి వివక్షకు తావులేకుండా ప్రతి ఒక్కరూ గౌరవం, సమానత్వ భావనతో వ్యవహరించాలని ఇన్‌స్పెక్టర్ రమేష్ బాబు సూచించారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ రవళి, షీ టీమ్ ఎస్ఐ లావణ్య, పోలీస్ సిబ్బంది, పెద్దపల్లి భరోసా కేంద్రం ఇన్‌చార్జ్ ఆశ్రిత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పరిశోధనాత్మక ఆలోచనలకు
జిజ్ఞాస వేదిక

- రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఐదు బృందాలకు బహుమతుల ప్రదానం
- విద్యార్థులు క్షేత్రస్థాయి సమస్యలకు పరిష్కారాలు చూపేలా ప్రాజెక్టులు రూపొందించాలి: జిల్లా కలెక్టర్ రాజర్షి షా





మొదటి పేజీ తరువాయి..

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు తరగతి గదులకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి, సమాజంలోని సమస్యలను అధ్యయనం చేయాలని సూచించారు. చరిత్ర, గిరిజన సంస్కృతి, అడవులు, వన్యప్రాణులు, గణితశాస్త్రం, స్మార్ట్ హెల్త్‌కేర్ సిస్టమ్స్ వంటి విభిన్న అంశాలపై విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు అభినందనీయమన్నారు. పుస్తక జ్ఞానంతో పాటు సమాజ సమస్యలను అన్ని కోణాల్లో విశ్లేషించి, వాటికి పరిష్కారాలు అన్వేషించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.విద్యార్థుల పరిశోధనలను జిల్లా స్థాయిలో మరింత ప్రోత్సహించి, వాటిని క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారానికి ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రాజెక్టుల రూపకల్పనలో ఎదురయ్యే లోపాలను గుర్తించి, ఎప్పటికప్పుడు సరిదిద్దుకుంటూ ముందుకు సాగాలన్నారు. చిన్నస్థాయి ప్రాజెక్టులతో ప్రారంభించి పీజీ, పీహెచ్‌డీ స్థాయిల వరకు పరిశోధనలను విస్తరించాలని సూచించారు. స్మార్ట్ ట్రాకింగ్ సిస్టమ్స్ వంటి వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శనలకే పరిమితం చేయకుండా కళాశాలల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో అమలు చేసి ఫలితాలు సాధించాలని పేర్కొన్నారు. ఆదివాసీ గూడేల్లో నెలకొన్న మూఢనమ్మకాలు, విద్యకు దూరమవుతున్న పిల్లల సమస్యలను గుర్తించి, స్వచ్ఛంద విద్యా అవగాహన కార్యక్రమాల ద్వారా పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పోటీల్లో సాధించిన నగదు బహుమతులను ఆయా ప్రాజెక్టుల అభివృద్ధి, విస్తరణకు వినియోగించాలని విజేతలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు డాక్టర్ జె. సంగీత, డాక్టర్ అతీక్ బేగం, టి. ప్రతాప్ సింగ్, జిజ్ఞాస జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ అరుణ్ కుమార్, సూపర్‌వైజర్లు యోగలక్ష్మి, కట్ట రమేశ్, నర్సింగరావు, ఆర్. పృథ్వీరాజ్, ప్రవంతి, అధ్యాపకులు జనార్దన్, జగ్రామ్, అంతర్వేది, ఆర్. సంతోష్ కుమార్, చక్రవర్తి, శ్రావణి, శ్రీధర్, జ్యోత్స్న, మంజుల, రమాకాంత్, రాజ్ కుమార్, రవికిరణ్, అష్రాఫ్ అలీ, శ్రావణ్ రాథోడ్, కరుణాకర్, శేఖర్, విజేత విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భూముల లీ సర్వే పనులను
పకడ్బందీగా నిర్వహించాలి
-తహసీల్దార్ జ్యోష్ణ

తాండూరు, (సత్యదిపిక ఉదయం)

భూముల రీ సర్వే పనులను పకడ్బందీగా నిర్వహించాలని తాండూరు తహశీల్దార్ జ్యోష్ణ అధికారులను ఆదేశించారు.



మండలంలోని కాసిపేట గ్రామాల్లో జరుగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భూముల హద్దులు, విస్తీర్ణం తదితర వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని సూచించారు. రీ సర్వే ప్రక్రియలో ఎలాంటి తప్పులు లేకుండా పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో సర్వేయర్ రామకృష్ణ, జీపీఓ శారద,వార్డు సభ్యులు గోవర్ధన్, సర్వే సిబ్బంది చిర్ల సాయి కృష్ణ రైతులు పాల్గొన్నారు.

రక్షణ ,ఉత్పత్తి లో
మేటి ఖైరుగుర ఓసి

తాండూరు, (సత్యదిపిక ఉదయం)

రక్షణ, ఉత్పత్తి లో మేటి ఖైరిగుర ఉపరితల గని అని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం శ్రీరమేష్ అన్నారు. బెల్లంపల్లి ఏరియా లోని ఖైరిగుర ఉపరితల గని 2024-25 ఆర్థిక సంవత్సరంలో జాతీయ స్థాయి లో 5 స్టార్ రేటింగ్ సాధించిన సందర్భంగా శుక్రవారం ఉపరితల గని వద్ద సంబరాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన జిఎం అధికారులు, ఉద్యోగుల కృషిని కొనియాడారు. ఇప్పటి వరకు మైన్ కు వచ్చిన పతకాలు, జ్ఞాపిక లను ప్రదర్శించారు.ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ.. ఖైరిగుర ఉపరితల గని



పనితీరు, రక్షణ చర్యలు , నిర్వహణ, సౌకర్యాలు, పర్యవరనహిత చర్యలు, కార్మిక సంక్షేమం వంటి 84 అంశాలలో జాతీయ స్థాయిలో ఇతర గనులతో పోటీ పడిందన్నారు. 100 మార్కులకు గాను 91 కి పైగా మార్కులతో 5 స్టార్ రేటింగ్ సాధించడం గర్వకారణం అన్నారు. అవార్డు రావడంలో ప్రతి ఉద్యోగి కృషి ఉందన్నారు.అనంతరం అత్యవరసర సమయంలో ఉద్యోగికి సిపిఆర్ చేసే విధానాన్ని రెస్క్యూ సిబ్బంది చూపించారు.ఈ కార్యక్రమం లో ఏ ఐ టి యూ సి బ్రాంచి కార్యదర్శి ఎస్ తిరుపతి, ఖైరిగుర ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం.నరేందర్ , ఎస్ ఓ టు జీఎం ఇ.స్వామిరాజు, ఏరియా ఇంజనీర్ బి.వీరన్న, ప్రాజెక్ట్ మేనేజర్ జే.శంకర్ ఖైరిగూడ పిట్ సెక్రటరీ మారం శ్రీనివాస్, ఇంచార్జి పి ఈ ఎస్ రాజు, సేఫ్టీ అధికారి గౌతమ్ రాజేష్ రెడ్డి అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

గంజాయి వినియోగదారులకు ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక కౌన్సిలింగ్

ఆసిఫాబాద్,సత్యదీపిక ఉదయం : నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా,ఈగల్ ఫోర్స్ తెలంగాణ సహకారంతో శుక్రవారం జిల్లా ఎస్పీ నితికా పంత్ ఆధ్వర్యంలో గంజాయి వినియోగానికి అలవాటుపడిన వ్యక్తులు, గంజాయి విక్రయాలకు సంబంధం ఉన్న వ్యక్తులను గుర్తించి ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వారితో నేరుగా మాట్లాడి గంజాయి వినియోగానికి గల కారణాలు, వారి కుటుంబ నేపథ్యం, ప్రస్తుత జీవన పరిస్థితులు, ఆర్థిక స్థితిగతులు, కుటుంబ పోషణ బాధ్యతలు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. డీఎస్పీ సైతం వారితో మాట్లాడి గంజాయి వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. గంజాయి వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు, వ్యక్తిగత జీవితంపై పడే ప్రతికూల ప్రభావాలు, కుటుంబ సభ్యులు ఎదుర్కొనే ఇబ్బందులు, ఆర్థికంగా ఎదురయ్యే నష్టాలను వివరించారు.ఒక వ్యక్తి గంజాయి వ్యసనానికి బానిస కావడం వల్ల అతని ఆరోగ్యంతో పాటు కుటుంబ ఆర్థిక పరిస్థితి, కుటుంబ పోషణ, పిల్లల భవిష్యత్తు, కుటుంబ సంబంధాలపై తీవ్ర ప్రభావం పడుతుందని వివరించారు. వ్యసనం కారణంగా కుటుంబాలు ఎదుర్కొనే పరిస్థితులను గుర్తించి, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.జిల్లాలోని కాగజ్‌నగర్, ఈస్గాం మండలాలతో పాటు మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలు, మహారాష్ట్రలోని చంద్రాపూర్, రాజురా తదితర ప్రాంతాల నుంచి గంజాయి అక్రమ రవాణా, సరఫరా జరిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ఆయా ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగాన్ని అరికట్టేందుకు ప్రత్యేక నిఘా, తనిఖీలు, సమన్వయ చర్యలు చేపడుతున్నామని, గంజాయి సరఫరా వెనుక ఉన్న వ్యక్తులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.గంజాయి వినియోగానికి అలవాటుపడిన వారిని కేవలం నేరస్థులుగా చూడకుండా, వారిలో మార్పు తీసుకువచ్చి వ్యసనం నుంచి బయటపడేలా చేయడం కూడా పోలీస్ శాఖ లక్ష్యమని తెలిపారు.గంజాయి వ్యసనం నుంచి విముక్తి పొందాలనుకునే వారికి అవసరమైన సహకారం అందిస్తామని, వారి పరిస్థితిని బట్టి అవసరమైతే కొన్ని రోజుల పాటు రిహాబిలిటేషన్ కేంద్రాల్లో ఉంచి, వైద్య నిపుణుల పర్యవేక్షణలో వ్యసన విముక్తి పొందేలా పోలీస్ శాఖ తరఫున ముందుండి సహకరిస్తామని ఎస్పీ భరోసా కల్పించారు.వ్యసనానికి అలవాటుపడిన వ్యక్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గంజాయిని విడిచిపెట్టాలని, వారి కుటుంబ సభ్యులు కూడా వారికి అండగా నిలిచి సాధారణ జీవనంలోకి తిరిగి వచ్చేలా సహకరించాలని కోరారు.డ్రగ్స్ రహిత జిల్లా నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, మాదకద్రవ్యాల వినియోగం,విక్రయాలు లేదా అక్రమ రవాణా గురించి సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. మాదకద్రవ్యాల సంబంధిత సమాచారం, ఫిర్యాదుల కోసం 1908 హెల్ప్‌లైన్ నంబర్‌కు లేదా వాట్సాప్ నంబర్ 8712671111 కు సమాచారం అందించాలని తెలిపారు.యువత భవిష్యత్తును కాపాడుతూ, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం కోసం డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, SAY NO TO DRUGS – SAY YES TO LIFE అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్‌డీఎస్పీ అశోక్, ఆసిఫాబాద్ టౌన్ సిఐ రవి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

- వ్యసన విముక్తికి అవసరమైతే రిహాబిలిటేషన్ కేంద్రాల్లో చేర్పించి సహకారం
- గంజాయి కేసుల్లో నమోదైన వారు గతాన్ని పాఠంగా తీసుకొని.. భవిష్యత్తును సన్మార్గంలో తీర్చిదిద్దుకోవాలి
- మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి.. మంచి మార్గంలో నడుస్తూ భవిష్యత్తును కాపాడుకోవాలి
- డ్రగ్స్ రహిత జిల్లా నిర్మాణమే లక్ష్యం
- జిల్లా ఎస్పీ నితికా పంత్



వాటర్ ప్లాంట్ వద్ద ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలి

- టైలర్స్, పోలీస్ కాలనీల్లో మురుగునీటి సమస్యకు చెక్
- జిల్లా కలెక్టర్ రాజర్షిషా

అదిలాబాదు ప్రతినిధి,సత్యదీపిక ఉదయం

పట్టణంలోని 14వ వార్డు పరిధిలో ఉన్న టైలర్స్ కాలనీ, పోలీస్ కాలనీల్లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. స్థానికులతో ముఖాముఖి మాట్లాడి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలోని మినరల్ వాటర్ ప్లాంట్ వద్ద ఇంకుడు గుంతల నిర్మాణాలు, కాలనీలో డ్రైనేజీ వ్యవస్థను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మురుగునీటి కాలువలు సరిగా లేకపోవడంతో నీరు ఇళ్ల మధ్యలోనే నిలిచిపోతోందని ప్రజలు తెలపగా.. సమస్య శాశ్వత పరిష్కారానికి టీయూఎఫ్ఐడీసీ ద్వారా మొత్తం రూ. 2.80 కోట్ల నిధులు మంజూరైనట్లు వెల్లడించారు. 14వ వార్డులోని టైలర్స్ కాలనీ, పోలీస్ కాలనీల్లో సీసీ డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణానికి రూ. 1 కోటి,



అలాగే వార్డు పరిధిలో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణానికి మరో రూ. 1.80 కోట్లు మంజూరయ్యాయని ఆయన స్పష్టం చేశారు. టెండర్ ప్రక్రియ కారణంగా కొంత జాప్యం జరిగిందని, వెంటనే డ్రైనేజీ లెవెల్స్ సరిచూసుకుంటూ ఎక్కడా నీరు నిలవకుండా పకడ్బందీగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఇళ్ల నుంచి వచ్చే వృథా, మురుగు నీరు రోడ్లపైకి రాకుండా ప్రతి ఇంటి ఆవరణలో తప్పనిసరిగా ఇంకుడు గుంత నిర్మించుకోవాలని, దీనిద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. బోరు నీరు కలుషితమై రంగు మారుతోందని స్థానికులు తెలుపగా, వెంటనే మెకానిక్‌ల సాయంతో ఆ బోర్లను ఫ్లషింగ్ చేయించి శుభ్రం చేయించాలని సూచించారు. ఈ క్షేత్ర పరిశీలనలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, మావల తహసిల్దార్ వేణు, స్థానిక కౌన్సిలర్ వెంకటేష్, మున్సిపల్ ఇంజనీరింగ్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవలను ప్రజలకు
మరింత చేరువ చేయాలి

- మానవతా సేవల్లో సభ్యులు చురుకైన పాత్ర పోషించాలి
- జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

నిర్మల్ ప్రతినిధి,సత్యదీపిక ఉదయం :

రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా నిర్వహించే సేవా కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయాలని, ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ మానవతా దృక్పథంతో సమాజ సేవలో



సభ్యులు చురుకైన పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు.శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నూతనంగా ఎంపికైన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సభ్యులతో కలెక్టర్ సమావేశమై సంస్థ లక్ష్యాలు, విధులు, భవిష్యత్తులో చేపట్టాల్సిన సేవా కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రెడ్‌క్రాస్ సంస్థ ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచే గొప్ప మానవతా సేవా సంస్థ అని పేర్కొన్నారు. రక్తదాన శిబిరాలను విస్తృతంగా నిర్వహించి, అత్యవసర సమయంలో రోగులకు సకాలంలో రక్తం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. యువతను రక్తదానానికి ప్రోత్సహించడంతో పాటు కళాశాలలు, విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు తక్షణ సహాయం అందించేలా సభ్యులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని తెలిపారు. పేదలు, అనాథలు, వృద్ధులు, దివ్యాంగులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు.రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ హెల్త్ కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరాలు, వైద్య పరీక్షలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. యువత, విద్యార్థుల భాగస్వామ్యంతో సేవా కార్యక్రమాలను విస్తృతం చేయడంతో పాటు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజల సహకారంతో కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. నూతనంగా ఎంపికైన సభ్యులందరూ సమన్వయంతో పనిచేసి జిల్లాలో రెడ్‌క్రాస్ సంస్థకు మరింత మంచి గుర్తింపు తీసుకురావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. చేపట్టాల్సిన కార్యక్రమాలకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని, వాటి అమలును ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని సూచించారు.అనంతరం.. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నిర్మల్ జిల్లా శాఖకు శాశ్వత భవన నిర్మాణం చేపట్టేందుకు అనువైన స్థలాన్ని ఎంపిక చేసి కేటాయించాలని ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సభ్యులు జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో జిల్లా సహకార శాఖ అధికారి ఎం. సత్యనారాయణ, రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షులు గొజ్జ జనార్దన్, వైస్ చైర్మన్ ఎం.సి. లింగన్న, ట్రెజరర్ అల్లాడి రవి, స్టేట్ మేనేజింగ్ కమిటీ సభ్యులు సమన్వల్లి రాఘవులు, సభ్యులు భూమయ్య, గంగన్న,నాగభూషణం,రాజేశ్వర్,రమేష్, ముజాహిద్, సాయన్న, రవీందర్,చిన్నయ్య,రాజన్న, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.



మార్వాడీ యువ మంచ్ ఆధ్వర్యంలో

విద్యార్థులకు రోగులకు స్వీట్స్ పంపిణీ

తాండూరు, (సత్యదీపిక ఉదయం)

ఆల్ ఇండియా మార్వాడీ యువ మంచ్ ఆధ్వర్యంలో నెన్నెల, కిష్టంపేట జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు బెల్లంపల్లి వందపడకల ఆసుపత్రిలో రోగులకు దీపావళి సందర్భంగా



300 స్వీట్స్ బాక్సులను పంపిణీ చేసి సేవాగుణం చాటుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పండుగ ఆనందాలను విద్యార్థులు రోగులతో పంచుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. దీపావళి పండుగను పురస్కరించుకుని స్వీట్స్ పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. రాబోయే రోజుల్లో మీ సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని కోరారు. అనంతరం మార్వాడీ యువ మంచ్ సభ్యులను ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కృష్ణకాంత్ సోనీ, కార్యదర్శి బాలప్రసాద్ మారూ, సంయుక్త కార్యదర్శి విజయ్ కుమార్ లాహోటి, సభ్యులు దామోదర్ లోయా, ప్రణిత్ లోయా, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

జోనల్ క్రికెట్ పోటీలకు ఎంఎంసీసీ అకాడమీ

క్రీడాకారుల ఎంపిక

బెల్లంపల్లి, నవంబర్ 06, సత్య దీపిక ఉదయం:

మంచిర్యాల జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్-14 క్రికెట్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన బెల్లంపల్లికి చెందిన ఎంఎంసీసీ క్రికెట్ అకాడమీ క్రీడాకారులు జోనల్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మంచిర్యాల జిల్లా పరిషత్ సెకండరీ స్కూల్ మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో ఎంఎంసీసీ క్రికెట్ అకాడమీకి చెందిన రెడ్డి రిత్విక్, సానా మోక్షిజ్ఞి, జిల్లపల్లి విజయ్, ఎం.డి. మెహరాన్ తమ ప్రతిభను చాటుకుని జోనల్ పోటీలకు అర్హత సాధించారు.ఈ పోటీలు ఆదిలాబాద్‌లో నిర్వహించనున్నట్లు అకాడమీ నిర్వాహకులు అల్లం వెంకటేశ్వర్లు, కోచ్ గౌతమ్ తెలిపారు. క్రీడాకారులు క్రమశిక్షణతో సాధన చేస్తూ జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి జోనల్ పోటీలకు ఎంపిక కావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను పలువురు క్రీడాభిమానులు, స్థానికులు అభినందించి, తదుపరి పోటీల్లోనూ విజయం సాధించాలని ఆకాంక్షించారు.



ప్రభుత్వ లక్ష్యాల సాధనలో జిల్లాల పనితీరు మెరుగుపడాలి



- జనవరి మొదటి వారంలోగా సమగ్ర శిక్ష, పీఎం శ్రీ నిధుల వినియోగం గరిష్ట స్థాయికి చేరాలి
- మార్చి నెలాఖరు నాటికి వివిజీరాంజీ ద్వారా 12 కోట్ల పనిదినాల కల్పన లక్ష్యం - వేసవి కాలం ముగిసే వరకు తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ఇసుక, సిమెంట్ రాయితీలను లబ్ధిదారులకు అందించాలి - కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో జిల్లా పనితీరును మెరుగుపరచాలి
- విద్య శాఖ పని తీరు , ఇందిరమ్మ ఇండ్లు , త్రాగు నీటి సరఫరా చర్యలు -రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

అదిలాబాదు ప్రతినిధి,సత్యదీపిక ఉదయం :

ప్రభుత్వ లక్ష్యాల సాధనలో జిల్లాల పనితీరు మెరుగుపడాలని, విద్య, వివిజీరాంజీ పథకం, చేయూత పింఛన్ల వెరిఫికేషన్, తాగునీటి సరఫరా, గృహ నిర్మాణ శాఖకు సంబంధించిన అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. శుక్రవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ ప్రభుత్వ పథకాల అమలు, నిధుల వినియోగం, లక్ష్యాల సాధనపై సీఎస్ సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ రాజర్షిషా అదనపు కలెక్టర్లు ఆర్.ఎస్.చిత్రా, ఎస్.రాజేశ్వర్ లతో కలిసి జిల్లా కలెక్టరేట్ వీసీ హాల్ నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హాజరయ్యారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, సమగ్ర శిక్ష అభియాన్, పీఎం శ్రీ పథకాల నిధుల వినియోగాన్ని పూర్తి స్థాయిలో చేపట్టాలని సూచించారు. జనవరి మొదటి వారంలోగా ఈ రెండు పథకాల నిధుల వ్యయాన్ని గరిష్టంగా 100 శాతానికి చేరేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అదనపు నిధులు విడుదల చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. పీఎం శ్రీ పథకం కింద మొత్తం రూ.538 కోట్ల నిధులు కేటాయించగా, ఇప్పటివరకు 10 శాతం నిధులు కూడా ఖర్చు చేయలేదని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 794 పాఠశాలలను పీఎం శ్రీ పాఠశాలలుగా ఎంపిక చేశామని, ఆయా పాఠశాలల్లో నిధుల వినియోగంతో పాటు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, విద్యా ఫలితాల మెరుగుదలపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పీఎం శ్రీ నిధుల వినియోగంపై ముఖ్యమంత్రి ప్రతి 10 రోజులకు ఒకసారి సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సమగ్ర శిక్ష అభియాన్ కింద రూ.1,763 కోట్లు కేటాయించగా, ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా రూ.960 కోట్లు ఉందని, ఇప్పటివరకు కేవలం రూ.79 కోట్లు మాత్రమే ఖర్చు చేయడం నిధుల వినియోగంలో ఉన్న పరిస్థితిని తెలియజేస్తోందని అన్నారు.సమగ్ర శిక్ష అభియాన్, విజిజీరాంజీ.పథకాలను సమన్వయం చేసుకుంటూ రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు, విద్యాసంస్థల్లో అదనపు తరగతి గదులు, అవసరమైన మరుగుదొడ్లు, ఇతర మరమ్మతు పనులు చేపట్టాలని సూచించారు.కేంద్ర ప్రభుత్వ పథకాలన్నీ ముఖ్యమంత్రి డాష్‌బోర్డులో ఉన్నాయని, ప్రతి జిల్లా పనితీరును మెరుగుపరచాలని కలెక్టర్లకు సూచించారు.ఈ ఏడాది పాఠశాల యూనిఫారాలు, విద్యార్థుల కిట్ల పంపిణీలో జరిగిన జాప్యాన్ని వచ్చే విద్యా సంవత్సరంలో పునరావృతం కాకుండా చూడాలని, విద్యా సంవత్సరం ప్రారంభంలోనే యూనిఫారాలు, కిట్లు అందేలా ముందస్తు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. అన్ని పాఠశాలలను అధికారులు తరచూ సందర్శించి, అక్కడి సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, మధ్యాహ్న భోజనం, అల్పాహార పథకాలు అన్ని పాఠశాలల్లో నాణ్యతతో అమలయ్యేలా చూడాలని తెలిపారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.వేసవి కాలం ముగిసే వరకు తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ప్రతి జిల్లాలో జిల్లా తాగునీటి కమిటీలను ఏర్పాటు చేయాలని, ఈ కమిటీల్లో జిల్లా పంచాయతీ అధికారి, మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పబ్లిక్ హెల్త్ అధికారులు, ఇతర సంబంధిత అధికారులు సభ్యులుగా ఉండాలని తెలిపారు. జిల్లా కమిటీ ప్రతి వారం సమావేశమై తాగునీటి సరఫరా పరిస్థితిని సమీక్షించాలని, నవంబర్ నెలాఖరులోగా మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నవంబర్ 15వ తేదీలోగా చేతిపంపులు, బోర్ పంపులు, బహిరంగ బావులు తదితర తాగునీటి మౌలిక సదుపాయాలకు అవసరమైన మరమ్మతులు పూర్తి చేయాలని సూచించారు. నవంబర్ 15 నుంచి డిసెంబర్ 31 వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి తాగునీటి సరఫరాలోని సమస్యలను గుర్తించి పరిష్కరించాలని, రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. మిషన్ భగీరథ పైప్‌లైన్లలో ప్రెజర్ వాల్వ్‌లను నిరంతరం పర్యవేక్షించాలని, నీరు వృథా కాకుండా చూడాలని, అక్రమ నీటి కనెక్షన్లు, అక్రమ ట్యాపింగ్ జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. వివిజీరాంజీ పథకం అమలులో భాగంగా నవంబర్ నెలలో ప్రస్తుతం రోజుకు సగటున 5.5 లక్షల మంది కూలీలు పనులు పొందుతున్నారని తెలిపారు. గత రెండేళ్లతో పోలిస్తే ఉపాధి కల్పనలో గణనీయమైన పురోగతి సాధించామని పేర్కొన్నారు. గత సంవత్సరాల్లో నవంబర్ నెలలో సగటున 25 వేల మందికి మాత్రమే పనులు కల్పించగా, ప్రస్తుతం రోజుకు దాదాపు 5.5 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు. వివిజీరాంజీ ద్వారా చేపట్టే పనులు నాణ్యతతో ఉండాలని, మార్చి నెలాఖరు నాటికి 12 కోట్ల పనిదినాల లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు విస్తృతంగా చేరవేయాలని, సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వ పనితీరును ప్రజలకు తెలియజేయాలని, ప్రతి ఇంటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, ఇసుక, సిమెంట్ రాయితీలను లబ్ధిదారులకు అందించాలని, మార్చి నెలాఖరు నాటికి వివిజీరాంజీ ద్వారా 12 కోట్ల పనిదినాల కల్పన లక్ష్యం - వేసవి కాలం ముగిసే వరకు తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత - ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ఇసుక, సిమెంట్ రాయితీలను లబ్ధిదారులకు అందించాలి - కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో జిల్లా పనితీరును మెరుగుపరచాలి - విద్య శాఖ పని తీరు , ఇందిరమ్మ ఇండ్లు , త్రాగు నీటి సరఫరా చర్యలు -రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



పురస్కరించుకుని ప్రభుత్వం ప్రారంభించిన "మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి" కార్యక్రమంలో భాగంగా పూర్తయిన అన్ని ఇందిరమ్మ ఇళ్లకు కొత్త లోగోతో కూడిన స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కొత్తగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లలో నిర్వహించే వేడుకలను సోషల్ మీడియా ఖాతాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతలో ఇప్పటివరకు కేవలం 43 వేల ఇళ్లకు మాత్రమే మంజూరు చేయడం జరిగిందని, ప్రజాప్రతినిధులు, ఇందిరమ్మ కమిటీలతో కలెక్టర్లు సమన్వయం చేసుకుంటూ ఇళ్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. రెండో విడతలో 2.5 లక్షల ఇళ్లు, మొదటి విడతలో మరో లక్ష ఇళ్ల మంజూరు ప్రక్రియ పెండింగ్‌లో ఉందని, వీటిని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఒక ఇందిరమ్మ ఇంటి నిర్మాణం ద్వారా సుమారు 10 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని, గృహ నిర్మాణ కార్యక్రమం ద్వారా ఉపాధి కల్పనకు కూడా అవకాశం ఉందని తెలిపారు. ఇసుక ధరలు కొన్ని జిల్లాల్లో అధికంగా ఉన్నట్లు వార్తలు వస్తున్నాయని, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక అందించే విషయంలో "మన ఇసుక -- మన వాహనం" యాప్‌ను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక ఉచితంగా అందించాలని, రవాణా ఖర్చులు మాత్రమే వసూలు చేయాలని తెలిపారు. ప్రతి లబ్ధిదారుడు ఇసుక ద్వారా పొందుతున్న ప్రయోజనాలను, ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సిమెంట్ బస్తాను రూ.230 చొప్పున సరఫరా చేయాలని, ఒక్కో బస్తాపై లబ్ధిదారుడికి రూ.100 ప్రయోజనం కలుగుతుందని, మొత్తం సుమారు రూ.50 వేల వరకు ప్రయోజనం అందే అవకాశం ఉందని తెలిపారు. సబ్సిడీ సిమెంట్ బస్తాల ద్వారా లబ్ధిదారులకు కలిగే ప్రయోజనం పూర్తిస్థాయిలో అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అర్డీఓ జగదీశ్వర్ రావు, జెడ్పీ సీఈఓ రవి, డిఆర్డీఓ రవీందర్ రాథోడ్, డీఈఓ మాధవి, హౌసింగ్ పీడీ శంకర్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, ఇతర శాఖల జిల్లా అధికారులు, తహసిల్దార్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను

పకడ్బందీగా అమలు చేయాలి

- వి బి జి రామ్ జి పథకం క్రింద చేపట్టే పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి- వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామీణ ప్రాంతాలలో త్రాగునీటి కొరత ఏర్పడకుండా ముందస్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి- చేయూత పింఛన్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలి- అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ పెండింగ్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

మంచిర్యాల ప్రతినిధి.సత్యదీపిక ఉదయం :

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత జిల్లా అధికారులతో ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రధానమంత్రి శ్రీ పథకం క్రింద రాష్ట్ర వ్యాప్తంగా 1 వేయి 734 పనులు చేపట్టగా 1 వేయి 175 పనులు పూర్తి కాగా 475 పనులు పురోగతిలో ఉన్నాయని, సమగ్ర శిక్ష పరిధిలో 4 వేల 266 పనులు చేపట్టగా 3 వేల 78 పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను వేగవంతం చేయాలని తెలిపారు. మంచిర్యాల జిల్లాలో 25 పాఠశాలలకు 2 కోట్ల 49 లక్షల రూపాయల నిధులు విడుదల కాగా, ఇప్పటి వరకు 79.48 లక్షల రూపాయలు ఖర్చు చేసి 32 శాతం నిధుల వినియోగం జరిగిందని తెలిపారు.



ప్రధానమంత్రి శ్రీ పథకం క్రింద జిల్లాలో చేపట్టిన 52 పనులలో 29 పూర్తి కాగా, మిగిలిన 23 పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. మిగిలిన నిధులను పూర్తి స్థాయిలో వినియోగించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పాఠశాలలను సందర్శించి త్రాగునీరు, మరుగుదొడ్లు, అదనపు తరగతి గదులు, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌లు, గ్రంథాలయాలు తదితర సదుపాయాలను పరిశీలించాలని, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామీణ ప్రాంతాలలో త్రాగునీటి కొరత ఏర్పడకుండా ముందస్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. మిషన్ భగీరథ ద్వారా శుద్ధి చేసిన నీటిని నిరంతరాయంగా సరఫరా చేయాలని, అవసరమైన ప్రాంతాలలో బోర్ల మరమ్మతులు, ఫ్లషింగ్, లోతు పెంపు పనులు చేపట్టాలని, ప్రత్యామ్నాయ వనరులు లేని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలని ఆదేశించారు. జిల్లా, మండల స్థాయిలో త్రాగునీటి సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసి ప్రతి 15 రోజులకు ఒకసారి సమావేశాలు నిర్వహించాలని, ఈ నెల 15 నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి హ్యాండ్ పంపులు, బోర్లు, మోటార్లు, ఓపెన్ వెల్స్ తదితర నీటి వనరుల మరమ్మతులు పూర్తి చేయాలని తెలిపారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని సమస్యాత్మక ఆవాసాలను ముందుగానే గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని తెలిపారు. వి బి జి రామ్ జి పథకం క్రింద చేపట్టే పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, మార్చి నెలాఖరుకు 12 లక్షల పని దినాల లక్ష్యాన్ని పూర్తి చేయాలని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు విస్తృతంగా చేరవేయాలని, సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వ పనితీరును ప్రజలకు వివరించాలని తెలిపారు. అర్హులైన పేదలకు సామాజిక భద్రత కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన చేయూత పింఛన్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. ఒంటరి మహిళలు, వితంతువులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, హైలేరియా బాధితులు, దివ్యాంగులకు సంబంధించిన 6 కేటగిరీలలో 5 లక్షల 95 వేల 532 దరఖాస్తులు రాగా 5 లక్షల 57 వేల 289 దరఖాస్తులను పరిశీలించడం జరిగిందని, దరఖాస్తులను 360 డిగ్రీ డేటా ఇంటిగ్రేషన్ ద్వారా పరిశీలించడంతో పాటు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని ఆదేశించారు. అర్హులైన లబ్ధిదారులను ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా



ఎంపిక చేయాలని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు.దీపావళి పండుగను పురస్కరించుకొని ప్రభుత్వం చేపట్టిన మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి కార్యక్రమంలో భాగంగా పూర్తి అయిన ఇందిరమ్మ ఇండ్లకు నూతన లోగోతో కూడిన స్టిక్కర్లు అతికించాలని, నూతన ఇందిరమ్మ ఇండ్లలో జరిగే వేడుకలను సోషల్ మీడియా ఖాతాలలో విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం క్రింద అర్హులైన పేదలకు ఇళ్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని, గుడిసెలలో నివసిస్తున్న నిరుపేదలకు ప్రాధాన్యత కల్పించాలని సూచించారు. 2వ విడతలో భాగంగా మొత్తం 2 లక్షల ఇళ్ల కేటాయింపు లక్ష్యంలో 43 వేల 730 ఇండ్లకు మంజూరు ఇచ్చిన నేపథ్యంలో మిగిలిన అర్హుల గుర్తింపు, మంజూరు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. 2 పడక గదుల ఇండ్ల పథకం క్రింద పూర్తయిన, పూర్తికి చేరువలో ఉన్న 41 వేల 840 ఇళ్లను ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం లబ్ధిదారులకు కేటాయించే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక సరఫరా చేయాలని, సీనరేజ్ ఛార్జీలు వసూలు చేయకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. 'మన ఇసుక వాహనం' యాప్ వినియోగంపై అవగాహన కల్పించాలని, సిమెంట్ బస్తాను 230 రూపాయలకే అందించే సదుపాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ద్వారా దాదాపు 10 మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. నిర్మాణ సామగ్రి సరఫరాలో ఎలాంటి జాప్యం లేకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు.రాష్ట్రంలో వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ పనులను వేగవంతం చేయాలని, నవంబర్ 4, 2026 నాటికి నివేదిక ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాలలో 441 ప్రాజెక్టులకు సంబంధించి 4.05 లక్షల ఎకరాల సేకరణకు ప్రతిపాదించగా 3 లక్షల 30 వేల ఎకరాలకు అవార్డు జారీ జరిగిందని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులు, జాతీయ రహదారులు, పారిశ్రామిక పార్కులు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, అవార్డుల జారీ, పరిహారం చెల్లింపులు, భూముల స్వాధీనం, భూభారతిలో నమోదు ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ పెండింగ్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు.ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల సాధనకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి, ప్రజలకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక వసతుల కల్పన, త్రాగునీటి సరఫరా, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, చేయూత పింఛన్లు, భూ సేకరణ పనులను అధికారుల సమన్వయంతో పకడ్బందీగా చేపట్టడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లెప్రసీ కాలనీ వాసులకు మెరుగైన మౌలిక

వసతులు కల్పించాలి

- గృహ స్థలాల సర్వే వేగవంతం చేసి, పక్కా ఇళ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలి
- జిల్లా కలెక్టర్ రాజర్షి షా

అదిలాబాదు,నవంబర్06,సత్యదీపిక ఉదయం :

పట్టణంలోని లెప్రసీ కాలనీ నివాసితులకు కేటాయించిన గృహ స్థలాలను జిల్లా కలెక్టర్ రాజర్షి షా శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కాలనీలో గృహ స్థలాల పురోగతి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, రహదారులు తదితర మౌలిక సదుపాయాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. అనంతరం కాలనీ వాసులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు.గృహ స్థలాలకు



సంబంధించిన సర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి, అర్హులైన లబ్ధిదారులకు పక్కా గృహాల నిర్మాణం త్వరితగతిన చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కాలనీలో కనీస మౌలిక సదుపాయాలు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని స్పష్టం చేశారు.లెప్రసీ బాధితుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని, వారు గౌరవప్రదమైన జీవనం సాగించేలా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. నివాసితులకు క్రమం తప్పకుండా వైద్య సేవలు, అవసరమైన మందులు అందేలా ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో జగదీశ్వర్ రావు, టౌన్ ప్లానింగ్ అధికారి సుమలత, తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ అధికారులు, సర్వే సిబ్బంది, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జి.ఓ. 76 దరఖాస్తుల విచారణ వేగవంతం చేసి, పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి
- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు

మంచిర్యాల,నవంబర్ 6, సత్యదీపిక ఉదయం :

జి.ఓ. నెం.76 క్రింద వచ్చిన దరఖాస్తుల విచారణ ప్రక్రియను వేగవంతం చేసి, పెండింగ్ దరఖాస్తులను నిర్ణీత



గడువులోగా పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో బెల్లంపల్లి, మందమర్రి, నస్పూర్ మండలాల తహసిల్దార్లు, డి-సెక్షన్ సూపరింటెండెంట్, డి ఎ ఓ మంచిర్యాల, సింగరేణి సంస్థ శ్రీరాంపూర్, మందమర్రి ఏరియాల జనరల్ మేనేజర్లు, ఎస్టేట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జి.ఓ. నెం. 76 క్రింద వచ్చిన దరఖాస్తుల విచారణ పురోగతిని సమీక్షించారు. దరఖాస్తుల వారీగా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, అవసరమైన వివరాలు, రికార్డులను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ, తమ పరిధిలోని పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఐ.ఎఫ్.ఎం.ఐ.ఎస్., డిజిటల్ గవర్నెన్స్‌పై అవగాహన కలిగి ఉండాలి
- కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాసరావు దేశ్‌పాండే

మంచిర్యాల,నవంబర్ 6, సత్యదీపిక ఉదయం :

ఐ.ఎఫ్.ఎం.ఐ.ఎస్. పోర్టల్, డిజిటల్ గవర్నెన్స్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాసరావు దేశ్‌పాండే తెలిపారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో హెచ్ ఓ ఓ లు, డి డి ఓ లు, మండల స్థాయి అధికారులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ పరిపాలన అధికారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ గవర్నెన్స్‌కు ప్రాధాన్యతనిస్తూ ఐ.ఎఫ్.ఎం.ఐ.ఎస్. విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తుందని తెలిపారు. ఆగస్టు 15వ తేదీ నుంచి ఐ.ఎఫ్.ఎం.ఐ.ఎస్. పోర్టల్ ద్వారా అన్ని బిల్లుల సమర్పణ డిజిటల్ విధానంలో కొనసాగుతుందని, 2027 జనవరి 1వ తేదీ నుంచి మాన్యువల్ విధానానికి పూర్తిగా స్వస్తి పలికి, ప్రభుత్వ కార్యకలాపాలను డిజిటల్ విధానంలోనే నిర్వహించవలసి ఉంటుందని తెలిపారు. డిసెంబర్ 31వ తేదీలోగా ఉద్యోగుల సర్వీస్ రిజిస్టర్లలో చేయవలసిన అన్ని వివరాల నమోదు, అప్‌డేషన్లను పూర్తి చేయాలని సూచించారు. జనవరి 1వ తేదీ నుంచి ఎంప్లాయీ సర్వీస్ రిజిస్టర్ పూర్తిస్థాయిలో అమలులోకి వస్తుందని తెలిపారు. శిక్షణలో భాగంగా ఈ.ఎస్.ఆర్. లో ఉద్యోగుల వివరాల నమోదు, నియామకాలు, పోస్టింగులు, సెలవుల దరఖాస్తు, సెలవుల రద్దు తదితర అంశాలను తెలుసుకోవాలని, వివరాల నమోదు, ఆమోదం సమయంలో అధికారులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి పర్యటనతో పాలనా వ్యవస్థపై సమగ్ర అవగాహన పొందాలి

అదిలాబాదు టౌన్,నవంబర్06,సత్యదీపిక ఉదయం :

జిల్లాలో ఆరు రోజులపాటు కొనసాగిన అఖిల భారత సర్వీస్ అధికారుల క్షేత్రస్థాయి శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ముగింపు సమావేశంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా ట్రైనీ అధికారులకు పలు సూచనలు చేశారు. IAS, IPS, IFoS తదితర అఖిల భారత సర్వీస్‌లకు చెందిన 18 మంది ట్రైనీ అధికారులను ఆదిలాబాద్ జిల్లాకు కేటాయించారు. అక్టోబర్ 31న జిల్లాకు చేరుకున్న వీరు నవంబర్ 1 నుంచి 6వ తేదీ వరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి క్షేత్రస్థాయి పరిస్థితులను అధ్యయనం చేశారు.ఈ సందర్భంగా విద్య, వైద్యం, ఉపాధి, ఆసుపత్రులు, ఐసీడీఎస్, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును పరిశీలించారు. స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో మాట్లాడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ సేవల అమలుపై అవగాహన పెంపొందించుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, క్షేత్రస్థాయి పర్యటన ద్వారా ప్రజల జీవన విధానం, స్థానిక పరిస్థితులు, ప్రభుత్వ పాలనా వ్యవస్థ, సంక్షేమ పథకాల అమలుపై సమగ్ర అవగాహన పొందాలని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న వాస్తవ సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం భవిష్యత్తులో ప్రజలకు మరింత సమర్థవంతమైన, పారదర్శకమైన పాలన అందించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీఆర్డీఏ పి డి రవీందర్ రాథోడ్, జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, శిశు సంక్షేమ శాఖ అధికారి మిల్కా ట్రైనీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.





మందమర్రి అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

- 1 వేయి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి చర్యలు
- పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యం
- 7 కోట్ల రూపాయలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు
- 200 కోట్ల రూపాయల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం- మందమర్రిలో 50 పడకల ఆసుపత్రి నిర్మాణానికి చర్యలు- మందమర్రి మున్సిపాలిటీలోని అన్ని వార్డులలో సి.సి. రోడ్లు, మురుగునీటి వ్యవస్థలను అభివృద్ధి చేసేందుకు పనులు చేపట్టాం
- రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద

మంచిర్యాల ప్రతినిధి,సత్యదీపిక ఉదయం :

మందమర్రి అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ అమలు చేయడం జరుగుతుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. శుక్రవారం జిల్లాలోని మందమర్రి పట్టణంలో బి 1 క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకం లబ్ధిదారులకు మంజూరైన చెక్కుల పంపిణీ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మందమర్రి మండల తహసిల్దార్ సతీష్, మున్సిపల్ కమిషనర్ రాజలింగు, డి.సి.సి. ప్రతినిధి రఘునాథ్ లతో కలిసి హాజరై చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాల కింద మంజూరైన చెక్కులను ఆలస్యం చేయకుండా 2 రోజులలోగా లబ్ధిదారులకు పంపిణీ చేయాలని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సంక్షేమ పథకాల లబ్ధిని అర్హులకు సకాలంలో అందించాలని సూచించారు. నిరుపేదల సంక్షేమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 2 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపట్టామని, రానున్న 2 సంవత్సరాలలో మరో 2 లక్షల ఇండ్లను కలుపుకొని 5 సంవత్సరాల కాలంలో మొత్తం 4 లక్షల ఇందిరమ్మ ఇండ్లను నిర్మించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతుందని తెలిపారు. మందమర్రి ప్రాంతం ఏజెన్సీ స్వభావం కలిగి ఉన్నందున సమస్య పరిష్కారానికి సింగరేణి సంస్థ సిఎండి తో చర్చించి సింగరేణికి చెందిన భూమిని సేకరించేలా చర్యలు తీసుకుంటున్నామని, ఈ భూమిలో సుమారు 1 వేయి ఇండ్ల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించడం జరుగుతుందని తెలిపారు.మహిళలకు ఆర్.టి.సి. బస్సులలో ఉచిత ప్రయాణం, గృహాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ వంటి పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి నెలకు సుమారు 5 వేల రూపాయల వరకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. మహిళల సంక్షేమం, పేద కుటుంబాల ఆర్థిక స్థితిగతుల మెరుగుదలే ప్రభుత్వ ప్రాధాన్యత అని తెలిపారు.మందమర్రిలో 7 కోట్ల రూపాయలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు మంజూరు లభించిందని, పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. చెన్నూరు నియోజకవర్గంలోని సోమనపల్లిలో సుమారు 200 కోట్ల రూపాయల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ఒకే ప్రాంగణంలో విద్య, వసతి, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించేలా ఈ పాఠశాలను నిర్మించడం జరుగుతుందని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు ఈ సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు.మందమర్రిలో 50 పడకల ఆసుపత్రి నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగా అనువైన స్థలాన్ని పరిశీలించామని, వచ్చే ఏడాది మార్చి లోపు మంజూరు పొందేలా ప్రయత్నించి, నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆసుపత్రి ఏర్పాటుతో స్థానిక ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని, వైద్య అవసరాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లవలసిన అవసరం తగ్గుతుందని తెలిపారు.మందమర్రి మున్సిపాలిటీలోని అన్ని వార్డులలో సి.సి. రోడ్లు, మురుగునీటి వ్యవస్థలను అభివృద్ధి చేసేందుకు పనులు చేపట్టామని, రానున్న 3 నుంచి 4 నెలలలో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇంటింటికీ తాగునీరు అందించేందుకు సుమారు 30 కోట్ల రూపాయలతో ఇందిరా వాటర్ స్కీమ్, అమృత్ వాటర్ స్కీమ్ అమలు చేయడం జరుగుతుందని, పట్టణ ప్రజలకు తాగునీటి సమస్యలు తీరుతాయని తెలిపారుప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో నీరు, విద్యుత్ వినియోగంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పొదుపు పాటించాలని కోరారు. రైతులు ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని నీటి లభ్యతను బట్టి పంటల సాగుపై నిర్ణయం తీసుకోవాలని, నీటి అవసరం ఎక్కువగా ఉండే వరి సాగు విషయంలో జాగ్రత్త వహించాలని, ఎలాంటి నష్టం కలగకుండా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని తెలిపారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును సుమారు 38 వేల కోట్ల రూపాయలతో ప్రతిపాదించి, ఇప్పటివరకు 11 వేల కోట్ల రూపాయల పనులు పూర్తయ్యాయని తెలిపారు.మందమర్రి ప్రాంత యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఇందుకోసం కొత్త మైన్ ఏర్పాటు చేయడంతో పాటు, ఎ.టి.సి. శిక్షణ కేంద్రం ద్వారా యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తున్నామని, జర్మన్ భాషలో శిక్షణ కల్పిస్తూ యువతకు విదేశాలలో మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.





జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారుల సమన్వయంతో చర్యలు చేపడుతున్నామని తెలిపారు. 68 మంది అర్హులైన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ పనులు చేపట్టడం జరుగుతుందని, కోటపల్లి మండలంలో నూతన ఎస్.సి. వసతి గృహం, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో అదనపు గదుల నిర్మాణానికి సుమారు 1.60 కోట్ల రూపాయలతో చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. రామకృష్ణాపూర్‌లో సింగరేణి సంస్థ సహకారంతో 50 పడకల ఆసుపత్రి ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, మందమర్రి మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించామని తెలిపారు. మందమర్రి, భీమారం, జైపూర్ మండలాల్లో విద్యార్థుల నమోదు శాతం 10 శాతానికి పైగా పెరిగిందని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గ పరిధిలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తయిందని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అమృత్ పథకం క్రింద మందమర్రిలో త్రాగునీటి పైప్‌లైన్ పనులు, క్యాతనపల్లిలో 2 నీటి ట్యాంకులు, పైప్‌లైన్ పనులు, చెన్నూర్ లో 3 నీటి ట్యాంకుల నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో రహదారులు, త్రాగునీరు, డ్రైనేజీ వంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు మహిళా భవనాలు, గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాలను చేపట్టడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులైన లబ్ధిదారులకు మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రామగుండం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్

పోలీస్ స్టేషన్ల నిర్వహణలో క్రమ-శిక్షణ,నేర నియంత్రణలో నిరంతర నిఘా తప్పనిసరి: పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా



గోదావరిఖని,సత్యదీపిక ఉదయం :

పోలీస్ స్టేషన్లను పరిశుభ్రంగా, క్రమబద్ధంగా నిర్వహించడంతో పాటు నేర నియంత్రణపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝాఅధికారులను, సిబ్బందిని ఆదేశించారు.రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని రామగుండం పోలీస్ స్టేషన్‌ను పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్ఐ హరి శేఖర్‌తో మాట్లాడి ఆన్‌లైన్‌లో కేసుల నమోదు, ఈ-సాక్ష్య, ఈ-సమన్ల అమలు, అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులు, పెండింగ్‌లో ఉన్న పాత కేసుల దర్యాప్తు పురోగతిని పరిశీలించారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, రౌడీషీటర్ల కదలికలపై నిరంతర నిఘా ఉంచడంతో పాటు వారిని క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని సూచించారు.పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన అన్ని రికార్డులు,రిజిస్టర్లను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలనిఆదేశించారు.పోలీస్ స్టేషన్ పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ, కేసులకు సంబంధించిన వాహనాలను క్రమబద్ధంగా భద్రపరచాలని తెలిపారు. రౌడీషీట్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, సంబంధిత వివరాలను పక్కాగా నమోదు చేయాలన్నారు.ఎస్‌హెచ్‌ఓలు బ్లూకోల్ట్స్ ,పెట్రోకార్ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ఎన్‌డీపీఎస్,ప్రాపర్టీ నేరాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు రైల్వే పోలీస్ పరిధిలోని జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ అధికారులతో సమన్వయం కొన సాగించాలని తెలిపారు.రైల్వే స్టేషన్ పరిసరాల్లోని అన్ని ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు సంబంధిత అధికారులతో సమన్వయం చేయాలని ఆదేశించారు.పోలీస్ స్టేషన్‌కు అందే ఫిర్యాదులపై చట్టప్రకారం తక్షణమే చర్యలు తీసుకోవాలని, ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సిన కేసుల్లో ఎలాంటి జాప్యం చేయకుండా కేసులు నమోదు చేసి దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.స్టేషన్ రైటర్లతో సహా ప్రతి పోలీస్ సిబ్బంది తమ విధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.పీఎం రాహత్ పథకంపై ముందుగా పోలీస్ సిబ్బందికి, అనంతరం ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు.ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడంతో పాటు నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి అధికారి, సిబ్బంది పూర్తి బాధ్యతతో పనిచేయాలని సీపీ సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం,రికార్డుల నిర్వహణలో అలసత్వాన్ని ఏమాత్రం సహించేది లేదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రామగుండం సీఐ కృష్ణ కుమార్ పాల్గొన్నారు.



రీ సర్వే పనులను వేగవంతం చేయాలి
- జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు

మంచిర్యాల,నవంబర్ 6, సత్యదీపిక ఉదయం :

జిల్లాలో భూ సర్వే పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)



వి.రాములు అన్నారు. శుక్రవారం జిల్లాలోని కన్నెపల్లి మండలం శిక్నం గ్రామంలో ప్రారంభమైన రీ సర్వేలో భాగంగా గ్రామ సరిహద్దుల నిర్ధారణ కార్యక్రమాన్ని మండల తహసీల్దార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే ప్రక్రియలో భాగంగా చేపట్టవలసిన పనులను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.అనంతరం బెల్లంపల్లి మండలం టేకులబస్తీలో జి.ఓ. నెం.76 క్రింద చేపడుతున్న క్షేత్రస్థాయి విచారణ, సర్వే ప్రక్రియను పరిశీలించారు. క్షేత్రస్థాయి సర్వే పనులను వేగవంతం చేయాలని సర్వే సిబ్బందికి పలు సూచనలు చేశారు. బెల్లంపల్లి మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి జి.ఓ. నెం.76 అమలు పురోగతి, సాదాబైనామా దరఖాస్తులు, భూభారతి, ఎస్ఐఆర్ ప్రక్రియలపై సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, జి.ఓ. నెం.76 క్రింద దరఖాస్తుల పరిశీలన, క్షేత్రస్థాయి విచారణ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



జి.ఓ. 76 దరఖాస్తుల విచారణ వేగవంతం చేసి, పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి - జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు

మంచిర్యాల,నవంబర్ 6, సత్యదీపిక ఉదయం :

జి.ఓ. నెం.76 క్రింద వచ్చిన దరఖాస్తుల విచారణ ప్రక్రియను వేగవంతం చేసి, పెండింగ్ దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో బెల్లంపల్లి, మందమర్రి, నస్పూర్ మండలాల తహసిల్దార్లు, డి-సెక్షన్ సూపరింటెండెంట్, డి ఎ ఓ మంచిర్యాల, సింగరేణి సంస్థ శ్రీరాంపూర్, మందమర్రి ఏరియాల జనరల్ మేనేజర్లు, ఎస్టేట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జి.ఓ. నెం. 76 క్రింద వచ్చిన దరఖాస్తుల విచారణ పురోగతిని సమీక్షించారు. దరఖాస్తుల వారీగా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, అవసరమైన వివరాలు, రికార్డులను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ, తమ పరిధిలోని పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వరద బాధితుల భద్రతే లక్ష్యంగా.. క్షేత్రస్థాయిలో కలెక్టర్ సేవలు!



- బేతుపల్లి వరదల వేళ ప్రజల రక్షణకు అహర్నిశలు కృషి చేసిన కలెక్టర్ దివాకర్ టీ.ఎస్.
- బాధ్యతకు, మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన జిల్లా కలెక్టర్
- కలెక్టర్ సేవలను అభినందిస్తూ ఘనంగా సత్కరించిన ఎఐజేఖీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు.
- నానబాల రామకృష్ణ, అర్వపల్లి నగేష్ ఆధ్వర్యంలో ఘన సన్మానం:

ఖమ్మం,సత్యదీపిక ఉదయం

అధికారం అంటే హోదా కాదు.. ప్రజల కష్టాల్లో అండగా నిలిచే బాధ్యత. ఆ బాధ్యతకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ టీ.ఎస్.ను తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ మామిడి సోమయ్య యూనియన్ (TWJF) ఖమ్మం జిల్లా కమిటీ అధ్యక్ష కార్యదర్శులు నానబాల రామకృష్ణ అర్వపల్లి నగేష్ , వారి యూనియన్ సభ్యులు ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బేతుపల్లి చెరువు ఘటన నేపథ్యంలో కలెక్టర్ దివాకర్ టీ.ఎస్. స్వయంగా ఘటనా స్థలాన్ని సందర్శించి, గత రెండు రోజులుగా విశ్రాంతి లేకుండా భద్రతా చర్యలను పర్యవేక్షిస్తూ, సంబంధిత అధికారులను సమన్వయం చేస్తూ ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. మరోసారి ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలపై ప్రత్యేక దృష్టి సారించారు.“విపత్కర పరిస్థితుల్లో అధికారి స్పందించే వేగమే ప్రజలకు కొండంత భరోసా. బాధ్యతను విధిగా కాకుండా మానవత్వంతో నిర్వర్తించినప్పుడే ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకోగలరు” అంటూ జర్నలిస్టులు కలెక్టర్ సేవలను ప్రశంసించారు.ఈ సందర్భంగా TWJF జిల్లా కమిటీ సభ్యులు మాట్లాడుతూ “అధికారి అంటే ఏసీ గదుల్లో కూర్చొని ఆదేశాలు జారీ చేయడం మాత్రమే కాదు.. ప్రజలు ఆపదలో ఉన్నప్పుడు వారి మధ్యకు వెళ్లి, వారి కన్నీళ్లకు భరోసా ఇవ్వడం. ప్రజల ప్రాణాలే పరమావధిగా భావించి క్షేత్రస్థాయిలో పనిచేసిన కలెక్టర్ దివాకర్ టీ.ఎస్. నిజమైన ప్రజాసేవకుడిగా నిలిచారు” అని కొనియాడారు.“పదవులు హోదాను ఇస్తాయి. కానీ ప్రజల కోసం చేసే సేవే గౌరవాన్ని తెచ్చిపెడుతుంది. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు చూపిన చొరవ, బాధ్యతాయుతమైన పర్యవేక్షణ ఎప్పటికీ అభినందనీయం” అని పేర్కొన్నారు.సన్మానానికి స్పందించిన జిల్లా కలెక్టర్ దివాకర్ టీ.ఎస్. TWJF జిల్లా కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల భద్రతే తమ ప్రథమ ప్రాధాన్యత అని, బేతుపల్లి ఘటనను దృష్టిలో ఉంచుకొని భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన అన్ని పటిష్టమైన భద్రతా చర్యలు చేపడతామని తెలిపారు.“ప్రజల ప్రాణాల కంటే విలువైనది ఏదీ లేదు.. ప్రజల భద్రత కోసం ప్రతి అధికారి బాధ్యతతో పనిచేయాలి” అనే సందేశాన్ని కలెక్టర్ తన కార్యాచరణ ద్వారా చాటిచెప్పారని TWJFప్రతినిధులు అభిప్రాయపడ్డారు.ప్రజా సమస్యలపై స్పందించే అధికారులు సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తారని, బేతుపల్లి ఘటనలో కలెక్టర్ మరియు అదనపు జిల్లా కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ,మరియు జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి (DPRO)గౌస్ పాషా చూపిన చొరవ ప్రజల్లో అధికార యంత్రాంగంపై నమ్మకాన్ని మరింత పెంచుతుందని జర్నలిస్టులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో TWJF జిల్లా అధ్యక్షులు నానబాల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి అర్వపల్లి నగేష్, నేషనల్ కౌన్సిల్ మెంబర్స్ ఎలుగోటి వెంకట్, కప్పల మధు, స్టేట్ కౌన్సిల్ మెంబెర్స్ బంక మన్మధరావు, మామిడాల వీరబాబు, జిల్లా ఉపాధ్యక్షులు లింగాల రామ్మూర్తి,చిన్నంశెట్టి రాంబాబు, పామర్తి నాగె శ్వరావు, మల్లెబోయిన, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల హక్కుల సాధనే టీడబ్ల్యూజేఎఫ్ లక్ష్యం

-సర్కారు వివక్ష పై సమరానికి సిద్ధం కావాలి -రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య





హైదరాబాద్,సత్యదీపిక ఉదయం :

రాష్ట్రంలో జర్నలిస్టుల హక్కుల సాధనే లక్ష్యంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ పని చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అన్నారు. అన్ని జిల్లాల్లో టిడబ్ల్యూజేఎఫ్ సంఘాన్ని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కుత్బుల్లాపూర్ లోని సూరారంలో గల బాబు జగ్జీవన్ రామ్-అంబేద్కర్ భవన్‌లో టీడబ్ల్యూజేఎఫ్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నాల్గవ మహాసభ విజయవంతంగా జరిగింది. ఈ మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మామిడి సోమయ్య మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం సంఘం నిరంతరం ఉద్యమిస్తుందని అన్నారు. టీడబ్ల్యూజేఎఫ్ ఏ రాజకీయ పార్టీకి అనుబంధం కాదని, ఏ ఒక్క పత్రికకు అనుకూలం కాదని ఆయన స్పష్టం చేశారు. జర్నలిస్టుల కోసమే పుట్టిన టీడబ్ల్యూజేఎఫ్ సంఘం పాలకుల పక్షం ఉండదని జర్నలిస్టుల పక్షాన సమస్యలపై పోరాడుతుందని అన్నారు. జర్నలిస్టుల పట్ల



కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ, జర్నలిస్టుల ఇళ్ళస్థలాలు, అక్రెడిటేషన్, హెల్త్ కార్డులు తదితర సంక్షేమ పథకాల సాధనకు పోరాటం చేస్తామని, ఈ పోరాటాలకు జర్నలిస్టులు ఐక్యంగా సిద్ధం కావాలని మామిడి సోమయ్య పిలుపునిచ్చారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ మాట్లాడుతూ,రాష్ట్రంలోనిసంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. గతంలో సంఘంలో కీలక పదవులు అనుభవించిన కొందరు వ్యక్తులు తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం సంఘ ప్రతిష్ఠను దెబ్బతీశారని, ప్రస్తుతం టిడబ్ల్యూజేఎఫ్ ను మళ్లీ బలోపేతం చేసి జర్నలిస్టుల విశ్వాసాన్ని నిలబెట్టే దిశగా అడుగులు వేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డమీది అశోక్ అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం టీడబ్ల్యూజేఎఫ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అంగూరు గోవిందరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శివ, ఉపాధ్యక్షులుగా డప్పు రామస్వామి, మంజులా రెడ్డి, దివాకర్, వెంకట నరసయ్య, ప్రధాన కార్యదర్శిగా బ్రహ్మచారి, కోశాధికారిగా కొండా సంజీవ కుమార్, సంయుక్త కార్యదర్శిగా శ్రీశైలం, ప్రచార కార్యదర్శిగా మధు, కార్యవర్గ సభ్యులుగా లక్ష్మి, సుస్మిత, సాయిరాజ్, ఆనంద్, కుమార్ గౌడ్, శ్యాం ముదిరాజ్,ఎలక్ట్రానిక్ మీడియా నియోజకవర్గ ఇన్చార్జ్ గా ప్రవీణ్ రాజ్, రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా కోశాధికారిగా తేజోమూర్తి, జిల్లా కమిటీ ప్రచార కార్యదర్శిగా వీరేష్ ముదిరాజ్, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దుర్గారావు, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా కోశాధికారిగా శ్యామల వెంకటేష్ తదితరులు నియమితులయ్యారు. ఈ సందర్భంగా టిడబ్ల్యూజేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు మామిడి సోమయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ నూతన కమిటీని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్‌జాతీయ కౌన్సిల్ సభ్యులు కుంచం శ్రీనివాస్,జగదీష్ గుప్తా, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, మేడ్చల్ జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ,జిల్లా ఉపాధ్యక్షులు కావాలి మోహన్, కూకట్పల్లి నియోజకవర్గం అధ్యక్షులు యాకయ్య, సీనియర్ జర్నలిస్టు శివ పార్వతి,స్వప్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ వద్ద ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలి - టైలర్స్, పోలీస్ కాలనీల్లో మురుగునీటి సమస్యకు చెక్ :జిల్లా కలెక్టర్ రాజర్షిషా

అదిలాబాదు,సత్యదీపిక ఉదయం :

పట్టణంలోని 14వ వార్డు పరిధిలో ఉన్న టైలర్స్



కాలనీ, పోలీస్ కాలనీల్లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. స్థానికులతో ముఖాముఖి మాట్లాడి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలోని మినరల్ వాటర్ ప్లాంట్ వద్ద ఇంకుడు గుంతల నిర్మాణాలు, కాలనీలో డ్రైనేజీ వ్యవస్థను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మురుగునీటి కాలువలు సరిగా లేకపోవడంతో నీరు ఇళ్ల మధ్యలోనే నిలిచిపోతోందని ప్రజలు తెలపగా.. సమస్య శాశ్వత పరిష్కారానికి టీయూఎఫ్ఐడీసీ ద్వారా మొత్తం రూ. 2.80 కోట్ల నిధులు మంజూరైనట్లు వెల్లడించారు. 14వ వార్డులోని టైలర్స్ కాలనీ, పోలీస్ కాలనీల్లో సీసీ డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణానికి రూ. 1 కోటి, అలాగే వార్డు పరిధిలో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణానికి మరో రూ. 1.80 కోట్లు మంజూరయ్యాయని ఆయన స్పష్టం చేశారు. టెండర్ ప్రక్రియ కారణంగా కొంత జాప్యం జరిగిందని, వెంటనే డ్రైనేజీ లెవెల్స్ సరిచూసుకుంటూ ఎక్కడా నీరు నిలవకుండా పకడ్బందీగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఇళ్ల నుంచి వచ్చే వృథా, మురుగు నీరు రోడ్లపైకి రాకుండా ప్రతి ఇంటి ఆవరణలో తప్పనిసరిగా ఇంకుడు గుంత నిర్మించుకోవాలని, దీనిద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. బోరు నీరు కలుషితమై రంగు మారుతోందని స్థానికులు తెలుపగా, వెంటనే మెకానిక్‌ల సాయంతో ఆ బోర్లను ఫ్లషింగ్ చేయించి శుభ్రం చేయించాలని సూచించారు.ఈ క్షేత్ర పరిశీలనలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, మావల తహసిల్దార్ వేణు, స్థానిక కౌన్సిలర్ వెంకటేష్, మున్సిపల్ ఇంజనీరింగ్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల విజయాలే కళాశాలకు గుర్తింపు

- కాకతీయ యూనివర్సిటీ గోల్డ్ మెడలిస్ట్ నుజాత్ అంజుమ్‌కు ఘన సత్కారం





మందమర్రి, సత్యదీపిక ఉదయం.

విద్యార్థుల ప్రతిభకు తగిన ప్రోత్సాహం అందిస్తూ వారిని ఉన్నత స్థాయికి చేర్చడమే లక్ష్యంగా వివేకవర్ధని డిగ్రీ అండ్ పీజీ కళాశాల కృషి చేస్తోందని కళాశాల కరస్పాండెంట్ డా. చంద్రమోహన్ గౌడ్ ఉదారి పేర్కొన్నారు. మంచిర్యాలకు చెందిన వివేకవర్ధని డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఆధ్వర్యంలో మందమర్రి మండలం అందుగులపేటలోని శ్రీ కన్వెన్షన్‌లో శుక్రవారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలు సందడిగా జరిగాయి. ఈ కార్యక్రమంలో కాకతీయ విశ్వవిద్యాలయం 2021--2023 విద్యా సంవత్సరానికి గాను గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థిని నుజాత్ అంజుమ్‌ను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆర్. శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో లక్ష్యసాధనకు క్రమశిక్షణ, సమయపాలన, నిరంతర శ్రమ ఎంతో అవసరమని అన్నారు. ప్రతిభ ఉన్నప్పటికీ దానికి కృషి తోడైనప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని వివరించారు. నుజాత్ అంజుమ్ విశ్వవిద్యాలయ స్థాయిలో బంగారు పతకం సాధించడం అభినందనీయమని, ఆమె విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. అలాగే కరస్పాండెంట్ డా. చంద్రమోహన్ గౌడ్ ఉదారి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కళాశాల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. విద్య అనేది కేవలం ఉద్యోగం సంపాదించడానికి మాత్రమే కాకుండా జీవితంలో ఉన్నత వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవడానికి దోహదపడుతుందని తెలిపారు. వివేకవర్ధని కళాశాలలో చదువుకున్న అనేకమంది పూర్వ విద్యార్థులు పోలీస్, రెవెన్యూ తదితర రంగాల్లో ఉన్నత ఉద్యోగాలు సాధించారని, మరికొందరు విదేశాల్లో స్థిరపడి కళాశాల పేరు నిలబెడుతున్నారని అన్నారు. విద్యార్థుల అభ్యున్నతే ధ్యేయంగా అధ్యాపకులు అంకితభావంతో పనిచేస్తున్నారని, ప్రతి విద్యార్థిని వ్యక్తిగతంగా ప్రోత్సహిస్తూ వారి సామర్థ్యాలను వెలికితీసేందుకు కృషి చేస్తున్నారని ప్రశంసించారు. విద్యార్థులు అపజయాలను చూసి భయపడకుండా వాటిని విజయానికి సోపానాలుగా మలుచుకోవాలని సూచించారు. నుజాత్ అంజుమ్ సాధించిన గోల్డ్ మెడల్ కళాశాలకే కాకుండా విద్యార్థులందరికీ స్ఫూర్తినిచ్చే విజయమని పేర్కొన్నారు. నాణ్యమైన విద్యాబోధనతోపాటు విద్యార్థులకు ఉన్నత విద్య, ఉద్యోగ రంగాల్లో మెరుగైన అవకాశాలు కల్పించే దిశగా కళాశాల నిరంతరం పనిచేస్తోందని యాజమాన్యం వెల్లడించింది. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు షరీనా, బి. రమేష్, శ్రీలేఖ, వైష్ణవి, పవిత్ర, శ్రీనివాస్, తిరుపతి, సతీష్, సమీర్, రమేష్, మమత, మౌనిక తదితరులు పాల్గొన్నారు. నుజాత్ అంజుమ్‌ను అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.